

పట్టిసీమ ఎత్తిపోతల పథకం (ఫైల్)

పట్టిసీమకు జలకళ

» నేడు నీటిని విడుదల చేయనున్న మంత్రి నిమ్మల రామానాయుడు

పోలవరం, జూలై 2 : ఐదేళ్ల తర్వాత పట్టిసీమ ఎత్తిపోతల పథకం మళ్లీ కళకళలాడనుంది. గత ప్రభుత్వ పాలనలో పూర్తిగా పడకేసి రైతులకు సాగు నీటి కష్టాలను మిగిల్చి ఇప్పుడు జలకళను సంతరించుకోనుంది. రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు బుధవారం ఉదయం 7.27 గంటలకు పట్టిసీమ ఎత్తిపోతల ద్వారా నీటిని విడుదల చేయనున్నారు. దీనిపై ఉమ్మడి కృష్ణా, పశ్చిమ గోదావరి డెల్టాల రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పూర్తయ్యేలోగా రైతులు సాగు నీటి కోసం ఇబ్బందులు పడకూడదనే దృక్పథంతో అప్పటి సీఎం చంద్రబాబునాయుడు రూ.1,600 కోట్లతో ఏడాది వ్యవధిలోనే పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని నిర్మించారు. దీని నుంచి 1800 క్యూసెక్కుల జలాలు పంపిణీ జరిగేది. ఏటా నాలుగు లక్షల ఎకరాల్లో సాగు చేసేవారు. టీడీపీ ప్రభుత్వం పట్టిసీమ ఆరంభం నుంచి 2019 రబీ సీజన్ వరకూ 305.07 టీఎంసీల నీటిని కృష్ణా, రాయలసీమ, ఉమ్మడి పశ్చిమ డెల్టాలకు పంపిణీ చేసింది. తర్వాత వైసీపీ ప్రభుత్వ పాలనలో పట్టిసీమ ఎత్తిపోతల పథకాన్ని నాలుగేళ్ళు పడకేయించి రైతుల ఉసురు పోసుకుంది. 2020లో 4.5424 టీఎంసీలు, 2021లో 1.6417 టీఎంసీలు పంపిణీ చేసింది. నాలుగేళ్లలో 58.7421 టీఎంసీలు మాత్రమే ఇచ్చింది. దీనివల్ల రైతులకు సాగు నీరందక, పంటలు నష్టపోయి విరామం పాటించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. ఈ ఏడాది పంటలకు సాగు నీటి కోసం ఎదురు చూస్తున్న రైతులకు పట్టిసీమ నేటి నుంచి జీవధార కానుందని రైతులు ఆనందోత్సాహాలు వ్యక్తం చేస్తున్నారు.

కౌలు కష్టం

సాగు హక్కు పత్రాలకు నో



పరి, వాణిజ్య పంటల సాగు చేపట్టే రైతుల్లో మూడో వంతు కౌలు రైతులే. భూ యజమానుల నుంచి భూములు కౌలుకు తీసుకుని ఆరుగాలం శ్రమిస్తున్న కౌలు రైతులకు రక్షణ లేకుండాపోయింది. వాస్తవానికి గ్రామాల్లో కౌలు రైతులు లేకుంటే 50 శాతం భూములు బీడువారే పరిస్థితి నెలకొంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కౌలుదారుల హక్కులను కాపాడేందుకు చట్టాలు చేస్తున్నా అమలుకు నోచుకోవడం లేదు.

» అమలుకాని ప్రణాళిక సంఘ సిఫార్సు
» మంజూరు కాని రుణ అర్హత కార్డులు
» అప్పులతోనే సాగు..
కౌలు రైతుల కష్టాలు తీరేదెన్నడో?

ముదినేపల్లి, జూలై 2: కౌలు రైతులకు భూముల సాగు హక్కు పత్రాల జారీ ప్రక్రియను పట్టించుకునే వారే లేరు. భూ యజమానులు తమ భూమిని కౌలుకు ఇచ్చినట్లు లిఖితపూర్వక పత్రం ఇస్తేనే రెవెన్యూ, వ్యవసాయ శాఖలు కౌలుదార్లకు సాగు హక్కు పత్రాలను జారీ చేస్తారు. అత్యధిక శాతం రైతులు కౌలుదార్లకు లిఖితపూర్వక పత్రాలు ఇచ్చేందుకు ముందుకు రావడం లేదు. భూములపై హక్కులు కోల్పోతామనే భయం రైతులను వెంటాడుతోంది. కౌలు రైతుకు సాగు హక్కు పత్రాలు ఇవ్వకపోవడంతో ఎన్నో ప్రయోజనాలు కోల్పోతున్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా కౌలు రైతులకు సాగు హక్కు పత్రాల జారీ నేటికీ ప్రారంభం కాలేదు. కౌలుదారుల గుర్తింపు కూడ జరగలేదు. దీంతో ప్రభుత్వం అందించే వ్యవసాయ పథకాలు కౌలుదారులు అందుకోలేకపోతున్నారు. బ్యాంకుల నుంచి వ్యవసాయ రుణాలు, ప్రకృతి వైపరీత్యాల సమయంలో పెట్టుబడి రాయితీ అందుకునే అవకాశం లేకుండాపోతున్నది. సాగుకు ప్రైవేట్ వ్యక్తుల నుంచి అధిక వడ్డీలకు కౌలు రైతులు అప్పులు చేయాల్సి వస్తున్నది. సుమారు ఐదేళ్ల కాలపరిమితికి సాగు హక్కు పత్రాలు ఉంటేనే బ్యాంకులు కౌలు దారులకు పంట రుణాలు ఇస్తాయి. రైతులు కౌలుదార్లను భూముల నుంచి ఎప్పుడు తప్పిస్తారో తెలియదు. పంట రుణం ఇచ్చాక కౌలుదారులు భూమి నుంచి మరుసటి సీజన్‌లో తప్పుకుంటే బ్యాంకర్లు రుణం వసూలుకు ఇబ్బందులు పడాల్సిందే.

అమలు కాని సిఫారసులు

భూ యజమానుల హక్కులకు నష్టం వాటిల్లకుండా కౌలు చట్టాల్లో మార్పులు తేవాలని 11వ పంచవర్ష ప్రణాళిక సంఘం రాష్ట్రాలకు సూచించింది. కౌలు రైతులకు పంట రుణాలు, పంటల బీమా తదితర సదుపాయాలను కల్పించేందుకు కౌలు చట్టాలను సవరించడమే ఏకైక మార్గమని సంఘం తన నివేదికలో పేర్కొంది. భూములపై సాగు హక్కులకు కాలపరిమితి విధించి, అది ముగియగానే యజమాని తన భూమిని వెనక్కి తీసుకునే అధికారం ఉండేలా చట్టాన్ని సవరించాలని చేసిన సూచనలను ప్రభుత్వాలు అమలు చేయలేకపోయాయి. రైతుల్లో భూముల యాజమాన్య హక్కులపై నెలకొన్న భయాలను తొలగించలేకపోయింది. దీంతో రైతులు సాగుదారులుగా గుర్తింపు పొందలేకపోతున్నారు. బ్యాంకుల నుంచి రుణం పొందేందుకు రుణ అర్హత కార్డు కూడా రావడం లేదు.

కౌలు రైతుల నమోదులో జాప్యం

అధీకృత సాగుదార్ల చట్టం -2011 ప్రకారం రెవెన్యూ అధికారులు ఏటా మే నెలలో గ్రామసభలు నిర్వహించి సాగుదార్లను గుర్తించాలి. భూ యజమానుల అంగీకారంతో గుర్తించిన కౌలుదారులకు తహసీల్దార్ రుణ అర్హత కార్డు జారీ చేయాలి. ఆ కార్డుపై ఆ పంట వరకే బ్యాంకులు రుణాలు మంజూరు చేస్తాయి. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ ప్రారంభమైనా కౌలు రైతులకు రుణ అర్హత కార్డులు మంజూరు కాలేదు. బ్యాంకుల నుంచి రుణాలు పొందే అవకాశం కోల్పోతున్నారు.

అందరికీ అందని రుణాలు

అధికారులు కౌలు రైతులను గుర్తించి కౌలు సాగు పత్రాలను మంజూరు చేసినా బ్యాంకుల నుంచి అందరికీ అందలేదు. ఏలూరు జిల్లాలో 2023-24లో 60,631 మంది కౌలు రైతులకు సీసీఆర్సీ కార్డులు పంపిణీ చేయగా 37,357 మందికి మాత్రమే రూ.145.73 కోట్ల రుణాలు పంపిణీ చేశారు. అంటే 60 శాతం మందికి రుణాలు అందాయి. కౌలు కార్డులు పొందినా బ్యాంకుల నుంచి వివిధ కారణాలతో రుణాలు పొందలేకపోతున్నారు.

కౌలు రైతులకు సహకరిస్తాం

అర్హులైన కౌలు రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు కృషి చేస్తున్నాం. సీసీఆర్సీ కార్డులు కలిగిన ప్రతీ కౌలు రైతుకు వ్యవసాయ శాఖ ద్వారా సబ్సిడీ, ఇతర ప్రయోజనాలు కల్పిస్తున్నాం. జిల్లాలో 60 శాతం మంది కౌలు రైతులకు రుణాలు పంపిణీ చేశాం. రైతులు రుణం తీసుకున్న సర్వే నెంబరు కలిగిన భూములపై తిరిగి కౌలు రైతులకు రుణాలివ్వడం ప్రధాన సమస్య. కౌలు రైతులను గుర్తించేందుకు కూడ చర్యలు తీసుకుంటాం.

– షేక్ హబీబ్ బాషా, జిల్లా వ్యవసాయాధికారి



1067 ఉమ్మడి పశ్చిమలో ఉపాధ్యాయ ఉద్యోగాలు

» మెగా డీఎస్సీకి మరో ముందడుగు » యాజమాన్యాల వారీగా వెకెన్సీల ఖరారుపై తుది కసరత్తు
» టీచర్ పోస్టుల భర్తీకి.. చంద్రబాబు ప్రభుత్వంలో మోక్షం » ఇన్‌సర్వీస్ టీచర్లకూ ఉపశమనమే

ఏలూరు అర్బన్, జూలై 2: నిరుద్యోగ అభ్యర్థుల ఆకాంక్షలకు అనుగుణంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ ప్రకటించింది. ఉపాధ్యాయ నియామకాలు చేపట్టేందుకు జిల్లా విద్యాశాఖ కసరత్తు దాదాపు కొలిక్కి వచ్చింది. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో పాఠశాల విద్యాశాఖతోపాటు, గిరిజన, సాంఘిక, వెనుకబడిన తరగతులు తదితర సంక్షేమ శాఖల యాజమాన్యాల్లోని పాఠశాలలు, గురుకులాలు, మోడల్ స్కూల్స్‌లో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ కేడర్లలో మొత్తం 1067 ఉపాధ్యాయ నియామకాలకు కూటమి ప్రభుత్వం ఇటీవల గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన విషయం విదితమే. ఆ మేరకు పాఠశాల విద్యాశాఖలో మంగళవారం సాయంత్రం వరకు అన్ని కేడర్లలో కలిపి మొత్తం 725 వేకెన్సీలను గుర్తించారు. మిగతా 342 ఖాళీలను సంక్షేమ శాఖల యాజమాన్యాల్లోని పాఠశాలల్లో భర్తీ చేసేందుకు అవకాశం ఉంది. ఈ సంఖ్యల్లో కొద్దిపాటి మార్పులతో దాదాపు తుదిగా భర్తీచేసే పోస్టులు యాజమాన్యాలవారీగా ఇవే ఉంటాయని సమాచారం. ఉమ్మడి జిల్లాలో అధికారికంగా యాజమాన్యాలవారీగా నోటిఫైచేసే పోస్టులపై బుధవారం ఒక స్పష్టతవచ్చే అవకాశం ఉంది.

నిరుద్యోగుల ఆకాంక్షలకనుగుణంగా...

గత వైసీపీ ప్రభుత్వం ఉమ్మడి జిల్లాలో కేవలం 228 ఉపాధ్యాయ పోస్టుల ను నోటిఫైచేసింది. క్షేత్రస్థాయిలో ఉద్యోగ ఖాళీలు అధికంగా ఉన్నా ఉన్నప్పటికీ జగన్ ప్రభుత్వం నిరుద్యోగుల ఆశలను నీరుగార్చేలా నోటిఫికేషన్ జారీ చేసిందని అప్పట్లో విద్యార్థి సంఘాలు, నిరుద్యోగులు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో డిగ్రీ, పీజీ విద్యార్హతలతో డీఎడ్, బీఎడ్ ఉపాధ్యాయ విద్య శిక్షణ పూర్తిచేసుకున్న వేలాది మంది నిరుద్యోగులకు ఊరట కలిగించేలా కొత్తగా అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ప్రభుత్వం తొలి సంతకాన్ని మెగా డీఎస్సీపై చేయడంతో ఉపాధ్యాయ అభ్యర్థుల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఇంతకుముందు నోటిఫై చేసిన 228 పోస్టులకు అదనంగా 839 పోస్టులను చేర్చి మొత్తం 1067 ఉపాధ్యాయ నియామకాలకు నిర్ణయం తీసుకున్నారు. ఇలా పెంచిన పోస్టులను భర్తీచేయడానికి ఉమ్మడి జిల్లాలో వేకెన్సీలను ఖరారు నిర్ణయాలతో నిరుద్యోగులకు ఊరట కలిగించనున్నారు. దీనికోసం పలు విధానపరమైన ఆలోచనలతోనే పోస్టుల సంఖ్య, వేకెన్సీల నిర్ధారణల్లో కొత్త ఒరవడి తీసుకురానున్నారు. ఆ ప్రకారం శాంక్షన్డ్ పోస్టులు ఉన్నా కూడా ఏళ్ల తరబడి భర్తీచేయకుండా నిలిపివేసిన పోస్టులను ఇపుడు ఇతర కేడర్లలోకి కన్వర్ట్ చేయడం ద్వారా మెగా డీఎస్సీలో నింపనున్నారు. ఈ క్రమంలో బాలికా విద్యార్థులు లేక ఏళ్ల తరబడి భర్తీకాకుండా ఉంచిన ఎల్ఎఫ్ఎల్ (లో ఫీమేల్ లిటరసీ) ప్రధానోపాధ్యాయుల వేకెన్సీలను ఇపుడు మెగా డీఎస్సీకోసం పోస్టులను కన్వర్ట్‌చేసి స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో నియామకాల సంఖ్యను పెంచనున్నారు. పదోన్నతులకు పదుల సంఖ్యలో సిద్ధంగా వున్న హైస్కూల్ హెచ్ఎం పోస్టులను ప్రమోషన్లపై భర్తీ చేయడం ద్వారా ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ కేడర్‌లో కొత్త పోస్టులను సృష్టించి మెగా డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌కు చేర్చనున్నారు. ఇటువంటి ఆలోచనను గత వైసీపీ ప్రభుత్వం చేయకపోవడం వల్ల వేల సంఖ్యలో ఉపాధ్యాయ ఖాళీలు ఏళ్ల తరబడి మిగిలిపోతున్నాయని నిరుద్యోగ అభ్యర్థులు వాపోతున్నారు. మరోవైపు పెద్దసంఖ్యలో ఉపాధ్యాయ నియామకాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలలకు పాటిస్తున్న ఉపాధ్యాయుడు:విద్యార్థుల నిష్పత్తి(1:20)ని తగ్గించే అవకాశాలూ లేకపోలేదని తెలుస్తోంది. అదే జరిగితే ప్రభుత్వ పాఠశాలల టీచర్లకు కూటమి ప్రభుత్వం భారీ ఊరటనిచ్చినట్లేనని భావిస్తున్నారు. ఏదేమైనా మెగా డీఎస్సీ నోటిఫికేషన్ అటు నిరుద్యోగుల్లోను, ఇటు ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయుల్లోను సంతోషాలు పండించడం ఖాయమని చెప్పవచ్చు.

839 పోస్టులు అదనం

వైసీపీ ప్రభుత్వం 228 పోస్టులకే నోటిఫై చేయగా, చంద్రబాబు కూటమి ప్రభుత్వం వీటికి అదనంగా 839 పోస్టులు చేర్చడం ద్వారా మొత్తం 1,067 పోస్టులను భర్తీ చేయాలని సంకల్పించింది. ఆ ప్రకారం.. చంద్రబాబు ప్రభుత్వం కొత్తగా 839 పోస్టులను మెగా డీఎస్సీకి చేర్చడానికి పరిశీలిస్తే ఇంతకాలం ఈ పోస్టులు ఉన్నప్పటికీ జగన్ ప్రభుత్వం భర్తీ చేకుండా ప్రభుత్వ పాఠశాలలను నిర్వీర్యం చేయడానికే పన్నాగం పన్నినట్టు స్పష్టమవుతోంది.



వరదలో చిక్కుకున్న గేదెలు

పోలవరం జూలై 2: గోదావరి నీటి మట్టం పెరగడంతో స్పిల్ చానల్‌పై రోడ్డు మార్గం మంగళవారం నీట మునిగింది. వరద నీటి మధ్యలో నాలుగు గేదెలు చిక్కుకు పోయాయి. పోలవరం ప్రాజెక్టులో 902 హిల్ ప్రాంతం నుంచి మహానందీశ్వరస్వామి ఆలయం మీదుగా దిగువ కాఫర్ డ్యాంకి మట్టి తరలింపు వాహనాలు రాకపోకలు సాగించడానికి స్పిల్ ఛానల్‌పై తూరలతో రోడ్డు మార్గం ఏర్పాటు చేశారు. గోదావరి నీటిమట్టం పెరగడంతో ఆ మార్గం వరద నీటితో మునిగిపోయింది. ఆ మార్గంలో 4 గేదెలు చిక్కుకుపోయాయి. నలువైపులా నీరు చేరడంతో వరదలో కొట్టుకుపోయే పరిస్థితి నెలకొంది. సమాచారం తెలుసుకున్న పోలవరం ఎస్ఐ పవన్ కుమార్ పడవలను ఏర్పాటుచేసి గేదెలను ఒడ్డుకు చేర్చే ఏర్పాటు చేశారు.



ఏలూరులోని జీఎంసీ బాలయోగి సైన్స్ మ్యూజియం

డీఎస్‌వో పోస్టు కోసం లాబీయింగ్!

ఏలూరు అర్బన్, జూలై 2: విద్యార్థులకు సైన్స్ పాఠ్యాంశాలు, ప్రయోగాలవైపు ఆసక్తి పెంపొందించడం, వారిని బాల శాస్త్రవేత్తలుగా ప్రోత్సహించే లక్ష్యంలో భాగంగా ఏర్పాటైన జీఎంసీ.బాలయోగి సైన్స్ మ్యూజియం కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు ఉద్దేశించిన జిల్లా సైన్స్ ఆఫీసర్ భర్తీ ఉపాధ్యాయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. ఈ పోస్టు దక్కించుకునేందుకు పలువురు ఉపాధ్యాయులు లాబీయింగ్ చేస్తున్నట్లు సమాచారం. మరోవైపు నియామకానికి డీఈవో ఆధ్వర్యంలో కమిటీ కూడా ఏర్పాటు కానున్నట్లు తెలుస్తోంది. రెండు దశాబ్దాలకుపైగా చరిత్రవున్న సైన్స్ మ్యూజియం రాష్ట్ర, జాతీయస్థాయిలో పలు సదస్సులు, టీచర్లకు శిక్షణ కార్యక్రమాలు, విజ్ఞానంకోసం విద్యార్థుల సందర్శనలతో కొన్నేళ్లపాటు అలరించింది. 2019నుంచి ఏ కార్యక్రమంలేక దాదాపుగా నిర్వీర్యమయ్యే దుస్థితికి చేరింది. జిల్లావ్యాప్తంగా విద్యార్థులను మ్యూజియం కు తరలించే బస్సు ఏనాడో నిలిచిపోయింది. ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్లు, సైన్స్ ప్రదర్శనలకే డీఎస్‌వో విధులు పరిమితమయ్యాయి. ఇవి మినహా మిగతా ఎటువంటి కార్యకలాపాలు లేని సైన్స్ మ్యూజియంను పర్యవేక్షించేందుకు తాజాగా జిల్లా సైన్స్ ఆఫీసర్ (డీఎస్‌వో) పోస్టును భర్తీచేయాలని జిల్లా విద్యాశాఖ ఇటీవల బహిరంగ ప్రకటన ఇచ్చింది. ఇప్పటివరకు జిల్లా సైన్స్ ఆఫీసర్‌గా అదనపు బాధ్యతలపై విధులు నిర్వర్తించిన ఉపాధ్యాయుడు ఇటీవల ఉద్యోగ విరమణచేయడంతో ఏర్పడిన ఖాళీని భర్తీ చేయడానికి నిర్ణయించారు. ఈ నేపథ్యంలో సైన్స్ మ్యూజియంలో పలు భవనాలు మరమ్మతులకు గురికాగా, వీటి రిపేర్లనిమిత్తం రూ.40 లక్షలు సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు నుంచి విడుదల కావడంతోనే జిల్లా సైన్స్ ఆఫీసర్ పోస్టు భర్తీకి మంచి గిరాకీ ఏర్పడిందన్న ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఈ నిధుల వినియోగంపై విస్తృత చర్చలు జరుగుతుండగా, కొత్తగా బాధ్యతలు తీసుకోనున్న జిల్లా సైన్స్ ఆఫీసర్‌కు ప్రభుత్వ నిధులు సద్వినియోగం చేయడానికి బాధ్యత తీసుకోవడం సవాల్‌గా భావిస్తున్నారు.

ఇప్పటికే ఈ పోస్టుకోసం కన్నేసిన కొందరు తమకు అర్హతలు లేవని తెలిసినా ఎవరికివారు లాబీయింగ్‌తో డీఎస్‌వో పోస్టు దక్కించుకునేందుకు తమవంతు ప్రయత్నాలు చేస్తుండడం గమనార్హం. ఈ క్రమంలో డీఎస్‌వో ఉద్యోగ ఖాళీని భర్తీని ప్రభుత్వ నిబంధనలమేరకు పారదర్శకంగా చేపట్టేందుకు డీఈవో అబ్రహం నేతృత్వంలో డీవైఈవో, ఎంఈవోలు, హెచ్ఎంలతో కూడిన కమిటీ ద్వారా జరిపించాలని నిర్ణయించి నట్టు సమాచారం. అలాగే రూ.40లక్షల నిధుల వినియోగానికి కూడా ఇంజనీరింగ్ నిపుణులు, విద్యాశాఖ అధికారులతో కూడిన కమిటీ పర్యవేక్షణ తప్పనిసరి చేయాలని భావిస్తున్నారు. మరోవైపు కాలక్షేపానికి సైన్స్ మ్యూజియంలో ఉద్యోగంలా కాకుండా, నిర్ణీత లక్ష్యసాధన కోసం నిరంతరం శ్రమించే ఉపాధ్యాయులకే అవకాశం ఇవ్వడంవల్ల ప్రయోజనకరంగా ఉంటుందని విద్యాశాఖ వర్గాలు భావిస్తున్నాయి. కాగా ఈ నెల ఐదో తేదీతో డీఎస్‌వో పోస్టు భర్తీకి దరఖాస్తు గడువు ముగియనుండగా, ఆ తర్వాత రెండు రోజుల వ్యవధిలోనే నియామకం పూర్తిచేయడానికి విద్యాశాఖ కసరత్తు చేస్తోంది.

ఆపరేషన్ భయంతో
రోగి ఆత్మహత్య
ఏలూరులో ఆసుపత్రి
నాలుగో అంతస్తు నుంచి దూకిన వైనం
7

నూజివీడు ట్రిపుల్ ఐటీలో
ప్రవేశాలు
రెండో రోజు కొనసాగిన
సర్టిఫికెట్ల పరిశీలన

వైద్యుల బదిలీ నిలిపివేత

ఏలూరు క్రైం, జూలై 2: వైద్య విధాన పరిషత్‌కు చెందిన వైద్యులను ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో సేవలందించేలా ఇక్కడే కొనసాగిస్తున్నారు. కొత్త మెడికల్ కళాశాలలో ఏర్పాటు చేసిన ఆసుపత్రులలో పనిచేస్తున్న వైద్య విధాన పరిషత్ వైద్యులను వారి మాతృ సంస్థకు పంపించాలని డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ కమిషనర్ ఉత్తర్వులు జారీచేశారు. ఉన్నతాధికారుల జోక్యంతో వారినే కొనసాగించాలని నిర్ణయించారు. దీంతో ప్రభుత్వాసుపత్రిలో పనిచేస్తున్న సీనియర్ వైద్యులు ఏఎస్.రామ్, డాక్టర్ పోతుమూడి శ్రీనివాసరావు, డాక్టర్ లిటోర్నదేవి, డాక్టర్ పీఏఆర్ఎస్ శ్రీనివాసరావు, డాక్టర్ బి.రవికుమార్‌ను సోమ వారం సాయంత్రం విధుల నుంచి రిలీవ్ చేస్తూ ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అగ్నస్ విజయ ఉత్తర్వులు జారీచేశారు. వైద్య సేవలు ఆసుపత్రిలో ఎంతో అవసరమని ప్రజా ప్రతినిధులు, అధికారులు డీఎంఏ దృష్టికి తీసుకు వెళ్ళడంతో బదిలీని నిలిపివేస్తూ మంగళవారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఐదుగురు వైద్యులు యథావిధిగానే వారి వైద్య సేవలను కొనసాగించడానికి అవకాశం ఏర్పడింది.

వైసీపీ కార్యాలయానికి కార్పొరేషన్ నోటీసు

ఏలూరు టూ టౌన్, జూలై 2: అనుమతి లేకుండా అక్రమంగా నిర్మించిన వైసీపీ కార్యాలయంపై ఎందుకు చర్యలు తీసుకోకూడదంటూ ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ళ నానికి ఏలూరు నగర పాలక సంస్థ కమిషనర్ ఎస్.వెంకటకృష్ణ నోటీసులు జారీచేశారు. రెవెన్యూ శాఖకు చెందిన రెండు ఎకరాల భూమిని వైసీపీ అధికార బలంతో 33 ఏళ్లకు లీజుకు తీసుకున్నా రు. ఇది అక్రమ నిర్మాణమని తెలిసి ఎమ్మెల్యే బడేటి చంటి టీడీపీ నాయ కులతో కలిసి ఈ భవనాన్ని పరిశీలించారు. దీనిపై చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్‌ను ఎమ్మెల్యే సూచించారు. దీనిపై కమిషనర్ నోటీసులు అందజేశారు. వైసీపీ నుంచి సరైన సమాధానం రాకపోతే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు.

నేడు నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం

ఏలూరు టూ టౌన్, జూలై 2 : ఏలూరు నగరపాలక సంస్థ సర్వసభ్య సమావేశం బుధవారం ఉదయం 10.30 గంటలకు జరుగనుంది. ఎమ్మెల్యే బడేటి చంటి ఎక్స్‌ఫిసియో మెంబర్‌గా హాజరుకానున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మొదటి సమావేశం కావడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. పది అంశాలతో కూడిన అజెండా తయారుచేశారు.

డయేరియాపై అప్రమత్తం

» విష జ్వరాల కేసులు నమోదైతే
అధికారులపై కఠిన చర్యలు : కలెక్టర్ వెట్రి సెల్వి

ఏలూరు సిటీ, జూలై 2: అపారిశుధ్యం, కలుషిత నీరు కారణంగా జిల్లాలో ఎక్కడైనా డయేరియా, విషజ్వరాల కేసులు నమోదైతే సంబంధిత శాఖల అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటానని కలెక్టర్ కె.వెట్రిసెల్వి హెచ్చరించారు. పారిశుధ్యం, తాగునీరు, తదితర అంశాలపై కలెక్టరేట్ నుంచి మున్సిపల్ కమిషనర్లు, మండలస్థాయి అధికారులతో మంగళవారం జూమ్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రి సెల్వి మాట్లాడుతూ వర్షాకాల సీజన్‌లో పారిశుధ్యం, తాగునీరు, దోమల నిర్మూలనపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. ప్రజల సమస్యల నమోదు కోసం ఏర్పాటు చేసిన 94910 41188 నెంబర్‌కు పారిశుధ్యం, దోమలు, తాగునీటి సమస్యలపై ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో పారిశుధ్య కార్యక్రమాలు పూర్తి స్థాయిలో నిర్వహించాలని, ఎక్కడా డయేరియా కేసులు నమోదు కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణ ప్రాంతంలో మున్సిపల్ కమిషనర్లు, గ్రామ ప్రాంతాలలో పంచాయతీ కార్యదర్శులు, ఈవోపీఆర్డీలు ఉదయం ఆరు గంటల నుంచే హాజరై పారిశుధ్య పనులు పర్యవేక్షించాలన్నారు. తాను పారిశుధ్య పనులను ఆకస్మికంగా తనిఖీ చేస్తానని, ఎక్కడైనా అధికారుల అలక్ష్యం కారణంగా డయేరియా కేసులు నమోదైతే వారిపై చర్యలు తీసుకుంటానన్నారు. గ్రామ, పట్టణ ప్రాంతాలలో తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకులు అన్ని శుభ్రం చేయాలని, క్లోరినేషన్ అనంతరమే తాగు నీరు సరఫరా చేయాలన్నారు. డ్రైనేజి వద్ద పైప్‌లైన్లు లీకేజీ కారణంగా తాగు నీరు కలుషితం అవుతుందని, అటువంటివి గుర్తించి వెంటనే లీకేజీలు అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. డ్రైనేజీలలో మురుగునీరు నిల్వ లేకుండా పూడిక తొలగించి ప్రతీ రోజు శుభ్రం చేయించాలని సూచించారు. దోమల నిర్మూలనకు మలాథియాన్, అబెట్ చల్లించాలన్నారు. ఫాగింగ్ చేయాల న్నారు. రోడ్లపై వర్షపునీరు, చెత్త నిల్వ లేకుండా పారిశుధ్య కార్మికులతో ప్రతీ రోజు శుభ్రం చేయించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

పనిచేసే చోట నివాసం ఉండాలి

పంచాయతీ కార్యదర్శులు పనిచేసే ప్రదేశంలోనే నివాసం ఉండాలన్నా రు. పారిశుధ్యం, తాగునీరు, దోమల సమస్యలపై ప్రతి రోజు దినపత్రికలలో ప్రచురించబడే వార్తాంశాలపై వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని, తీసుకున్న చర్యలను రిజాయిండర్‌గా పత్రికలకు పంపాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కలిగించాలని కలెక్టర్ వెట్రి సెల్వి అధికారులను ఆదేశించారు. సమావేశంలో డీపీవో టి.శ్రీనివాస విశ్వనాథ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సత్యనారాయణ, ఏలూరు నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్ వెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



బాలికను దత్తత ఇస్తున్న జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి

దత్తత పిల్లలకు మంచి భవిష్యత్ ఇవ్వాలి

ఏలూరు క్రైం, జూలై 2 : దత్తత పొందిన పిల్లలకు వంశపారంపర్యంగా సంక్రమించే అన్ని హక్కులూ అందుతాయని, దత్తత తీసుకున్న పిల్లలను సొంత బిడ్డలుగా పెంచి పెద్ద చేసి మంచి భవిష్యత్ అందించాలని కలెక్టర్ కె.వెట్రీసెల్వి కోరారు. ఒక బాలికను, బాలుడిని దత్తత చేసుకునే తల్లి దండ్రులకు కలెక్టర్ వెట్రిసెల్వి మంగళవారం పత్రాలను అందించి పిల్లలను అప్పగించారు. 12 సంవత్సరాల ప్రసన్న ప్రియను పాలకొల్లునకు చెందిన రాజమణికి దత్తత ఇచ్చారు. 11 సంవత్సరాల గణేశ్ అనే బాలుడిని రవికు మార్, ఉష దంపతులకు ఐసీడీఎస్ అధికారుల సమక్షంలో దత్తత అందిం చారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రి సెల్వి మాట్లాడుతూ పెద్ద పిల్లలను దత్తత తీసుకోవడం అభినందనీయమని, దత్తత తీసుకున్న బాలలను తల్లిదండ్రులు వారికి పుట్టిన సొంత బిడ్డలుగానే చూసుకోవాలన్నారు. జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారి కె.పద్మావతి, జిల్లా బాలల సంరక్షణ అధికారి డాక్టర్ సీహెచ్ సూర్య చక్రవేణి, శిశుగృహ మేనేజర్ భార్గవి పాల్గొన్నారు.



కారును చూసేందుకు భారీగా చేరుకున్న అభిమానులు (ఇన్‌సెట్‌లో) బుజ్జి కారు

భీమవరంలో 'కల్కి' కారు

భీమవరం అర్బన్, జూలై 2: పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ హీరోగా నటించిన కల్కి 2898 ఏడీ సినిమాలో ప్రభాస్ వినియోగించిన కారు (బుజ్జి)ను భీమవరం తీసుకొచ్చారు. అభిమానులకు చూపించేందుకు చిత్రబృందం భీమవరంలోని గీత మల్టీప్లెక్స్ ప్రాంగణంలో మంగళవారం ఉంచారు. దీనిని చూసేందుకు ప్రభాస్ అభిమానులు భారీగా తరలివచ్చి 'బుజ్జి' కారుతో సెల్ఫీలు దిగుతూ ఫిదా ఆయ్యారు.

విద్యా, క్రీడా సమాచారం

ఓపెన్ స్టడీ సెంటర్ల అనుమతికి దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు ఎడ్యుకేషన్, జూలై 2 :ఏపీ ఓపెన్ స్కూల్స్ దూరవిద్య టెన్త్, ఇంటర్మీడియట్ కోర్సులకు జిల్లాలో కొత్త స్టడీ సెంటర్లకు అనుమతి ఇచ్చేందుకు ప్రభుత్వ/ఎయిడెడ్/మున్సిపల్/ప్రైవేటు హైస్కూళ్లు, జూనియర్ కళాశాలల యాజమాన్యాల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు డీఈవో అబ్రహం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తులను ఏపీ ఓపెన్ స్కూల్ వెబ్‌సైట్‌నుంచి పొందవచ్చన్నారు. ఇప్పటికే అనుమతి తీసుకున్న స్టడీ సెంటర్లు కూడా రెన్యువల్ చేసుకోవాలని సూచించారు.

డిగ్రీ కోర్సుల్లో అడ్మిషన్లకు నోటిఫికేషన్ జారీ

ఏలూరు ఎడ్యుకేషన్, జూలై 2 :ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ కళాశాలల్లో ఆన్‌లైన్ ప్రవేశాలకు ఉన్నత విద్యామండలి మంగళవారం నోటిఫికేషన్ జారీ చేసిందని ఏలూరు కోటదిబ్బ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ గిరిబాబు ఓ ప్రకటనలో తెలిపారు. ప్రథమ సంవత్సరంలో అడ్మిషన్లకు విద్యార్థులు ఈనెల పదో తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, కళాశాల, కోర్సు ఎంపికకు 11నుంచి 15వరకు ఆన్‌లైన్‌లోనే ఆప్షన్ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. అడ్మిషన్లు, కోర్సుల ఎంపికకు విద్యార్థుల కోసం తమ కళాశాలలో ఉచిత హెల్ప్‌లైన్ సెంటర్‌ను ఏర్పాటు చేశామని, విద్యార్థులు ఈ సెంటర్‌ను వినియోగించుకోవాలని సూచించారు.

రెండో రోజు కొనసాగిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్



ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ కోర్సుల ప్రవేశానికి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌లో పాల్గొన్న విద్యార్థులు

నూజివీడు టౌన్, జూలై 2: రాజీవ్‌గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలోని ట్రిపుల్ ఐటీల్లో ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు ప్రత్యేక కేటగిరి అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమం రెండో రోజు కొనసాగింది. మంగళవారం నూజివీడు ట్రిపుల్ ఐటీలో సైనిక సంతతికి చెందిన విద్యార్థులు 62 మంది, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగంలో 113 మంది మొత్తం 175 మంది విద్యార్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు అయ్యారు. అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎస్.అమరేంద్రకుమార్ అధ్వర్యంలో ట్రిపుల్ ఐటీ అధికారులు సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని నిర్వహించగా, బుధవారం సైనిక సంతతికి చెందిన విద్యార్థులు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, దివ్యాంగులు, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ కేటగిరిల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ట్రిపుల్ ఐటీ అధికార వర్గాలు తెలిపాయి.

ప్రశంసాపత్రాలతో విజేతలు



ఉత్సాహంగా ఓపెన్ చెస్ పోటీలు

ఏలూరు స్పోర్ట్స్, జూలై 2: ఏలూరు శాంతినగర్ 7వ రోడ్డులోని బచ్‌ఫన్ స్కూల్ ప్రాంగణంలో అబ్రహం, గ్యారీ కాస్పరోవ్ ఏలూరు జిల్లా స్థాయిలో ఓపెన్ చెస్ పోటీలు మంగళవారం ఉత్సాహంగా జరిగాయి. టెస్లా కంపెనీ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ జి.కార్తీక్ చెస్ పోటీలను ప్రారంభించారు. పోటీల్లో జి.అనురూప్ మోషే ప్రథమస్థానం, జి.అభిషేక్ అబ్రహం ద్వితీయ, ఎం.విక్రాంత్ తృతీయస్థానం సాధించారు. ఏజ్ గ్రూప్‌లో ఎస్.స్టీవెన్, టి.నవనీత్, లోహిత్, కార్తికేయ, ఎం.కాంస్య, ఎం.చిరస్మీ, జి.జ్ఞానసంకేత్, శ్రేయస్‌లు గెలుపొందారు. వీరికి ప్రశంసా పత్రాలు అందజేశారు. అకాడమి డైరెక్టర్ యోహానస్ పర్యవేక్షించారు.

రేపటి నుంచి రాష్ట్రస్థాయి నాటిక పోటీలు

ఏలూరు కల్చరల్, జూలై 2: ఏలూరు వైఎంహెచ్ఏ ప్రాంగణంలో ఈనెల 4,5,6,7 తేదీల్లో అల్లూరి సీతారామరాజు స్మారక రాష్ట్రస్థాయి నాటిక పోటీలు నిర్వహిస్తున్నట్టు వైఎంహెచ్ఏ మేనేజ్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు ఎర్రా సోమలింగేశ్వరరావు, ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి వేమా కోటేశ్వరరావు, కార్యనిర్వాహక కమిటీ అధ్యక్షుడు జవ్వాజి మోహన్‌విఠల్, ప్రధాన కార్యదర్శి మజ్జి కాంతారావు, హేలాపురి కళా పరిషత్ అధ్యక్షుడు పెదపాటి రామకృష్ణ తెలిపారు. వైఎంహెచ్ఏ, హేలాపూరి కళా పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ఎంతో ఘనచరిత్ర కలిగిన నాటక కళా సమాజాలచే ఏడు నాటికలు ప్రదర్శిస్తారన్నారు. 4వ తేదీన రాత్రి 'రాజుగారి గోచి', 5న 'రాటా', 6న 'ఇంద్రప్రస్థం', 'మళ్లీ కలిసి జీవిద్దాం', 7న 'కౌసల్య, సుప్రజ, రామ' తదితర నాటికలు ప్రదర్శిస్తారన్నారు. ప్రత్యేక ప్రదర్శనలుగా మయసభ ఏకపాత్రాభినయం, పద్యనాటకం, ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.

10,11 తేదీల్లో రైతు సంఘ శిక్షణ తరగతులు

ద్వారకాతిరుమల, జూలై 2: రైతు సంఘ జిల్లాస్థాయి శిక్షణ తరగతులు మండలంలోని ఎం.నాగులపల్లి గ్రామంలో ఈనెల 10,11 తేదీల్లో జరుగుతాయని సంఘ జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు. గ్రామంలో మంగళవారం ఆయన విలేకరు లతో మాట్లాడుతూ స్థానిక రైతు ఉత్పత్తిదారుల సంఘ భవనంలో సమావేశం జరుగుతుందన్నారు. వ్యవసాయరంగంలో వస్తున్న మార్పులు, ప్రభుత్వ విధానా లపై సంఘ రాష్ట్ర నాయకులు మాట్లాడతారన్నారు. గత ఐదేళ్లుగా వైసీపీ పాలనలో దొండ పందిళ్ల సబ్సిడీ బకాయిలను అందించలేదని, వాటిని విడుదల చేసి రైతులకు అందించి ఆదుకోవాలన్నారు.



తరుముకొస్తున్న ప్లాస్టిక్ భూతం

మానవ జీవితంలో భాగమైన ప్లాస్టిక్

నేడు అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచుల వ్యతిరేక దినం

ప్లాస్టిక్.. మానవ జీవితంలో భాగంగా మారింది. ప్లాస్టిక్ వినియోగం లేనిదే మనిషి దైనందిన జీవితం ప్రారంభం కావడంలేదు. ఉదయం లేచింది మొదలుకుని, రాత్రి నిద్రించే వరకు ప్లాస్టిక్ వినియోగించని మనిషి కనిపించడం లేదు. ప్లాస్టిక్ వినియోగంలో భారతీయులు సగటున ఏడాదికి సుమారు 12 కేజీలు వినియోగిస్తుండగా అమెరికన్లు సుమారు 110 కిలోలు వినియోగిస్తున్నారు. ఈ సంఖ్యను చూసి మనం మురిసి పోయే అంత అవకాశం లేదు. ఎందుకంటే భారతీయ జనాభాతో పోలిస్తే అమెరికాలో ఐదో వంతే జనాభా ఉన్నారు. భూభాగం విషయానికి వస్తే మన దేశ విస్తీర్ణం కన్నా అమెరికా దేశ విస్తీర్ణం మూడు రెట్లు అధికంగా ఉంది. ఈ గణాంకాలతో పోల్చి చూసినప్పుడు చదరపు మీటరు విస్తీర్ణంలో అమెరికా కన్నా మన దగ్గరే ప్లాస్టిక్‌వ్యర్థాలు అధికంగా ఉన్నాయి. నేడు అంతర్జాతీయ ప్లాస్టిక్ సంచుల వ్యతిరేక దిన సందర్భంగా ప్రత్యేక కథనం.

పాలకొల్లు, జూలై 2 :
మన దేశానికి 900 మిలియన్ అమెరికన్ డాలర్లు విలువ చేసే ప్లాస్టిక్ క్రాప్ ఏడాదికి ఇతర దేశాల నుంచి దిగుమతి అవుతుంది అంటే ప్రమాదం ఏ స్థాయిలో ఉందో తెలుస్తోంది. ప్రస్తుతం ప్లాస్టిక్ వ్యర్థాలు భూమిపైనే కాకుండా నదీ జలాలు, సముద్రజలాల్లో కలిసి నీటి చరాలను సైతం ఇబ్బంది కలిగిస్తున్నాయి. ఒక అంచనా ప్రకారం సముద్ర జీవాలు 2050 నాటికి 99శాతం ఉంటే ప్లాస్టిక్ వ్యర్థాలు వంద శాతానికి చేరతాయని, పలు అధ్యయనాల ద్వారా తెలుస్తోంది. చేపలు, ఇతర జల చరాలు, మైక్రో ప్లాస్టిక్ తినడంద్వారా మత్స్య ఉత్పత్తి నానాటికీ క్షీణిస్తోంది.

వ్యవసాయానికి పెనుముప్పు..

ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో 11 లక్షలకు పైబడి హెక్టార్లలో వరి, మరి అంత విస్తీర్ణంలో ఇతర పంటలు పండిస్తున్నారు. వ్యవసాయ పంటలకు ఇప్పుడు ప్లాస్టిక్ పెనుముప్పుగా మారింది. ఒక వైపు జల చరాలకు ప్రమాదంగా మారగా, మరోవైపు భూమిపై వ్యవసాయ పంటలకు, మూగ జీవాలకు ప్రాణ సంకటంగా మారింది. ముఖ్యంగా పట్టణాలు, గ్రామీణ ప్రాంతాలలో వృథా ఆహారంతో కలిసి ఉన్న క్యారీ బ్యాగులను ఆవులు, ఇతర మూగ జీవాలు తినడం ద్వారా అవి ప్రాణాలు కోల్పోతున్నాయి. అంతేకాకుండా గోవులు ప్లాస్టిక్ వ్యర్థాలు తింటూ ఆరోగ్యంగా ఉన్న సమయంలో అవి ఇచ్చే పాలల్లో సైతం ప్లాస్టిక్ సూక్ష్మాలు కనిపిస్తున్నాయి.

» ప్రత్యామ్నాయ వస్తువులు చూపడంలో ప్రభుత్వం విఫలం
» నిషేధం అసాధ్యం అంటున్న నిపుణులు
» రీ-సైక్లింగ్‌తో పరిష్కారం
» ఏడాదిలో భారతీయులు సగటున 12 కేజీలు, అమెరికన్లు 110 కేజీల వినియోగం
» మిషన్-2022ను నెరవేర్చ లేకపోయిన ప్రధాని మోదీ



ప్లాస్టిక్ వ్యర్థాలను తింటున్న ఆవులు

జీవితంలో భాగం..

నేటి ఆధునిక జీవితంలో 50శాతం పైబడి పౌరులు సెల్‌ఫోన్లకు బానిసలు కాగా, పేద గొప్పతారతమ్యం లేకుండా నూరుశాతం ప్రజలు ప్లాస్టిక్‌కు బానిసలుగా మారారు. ప్రతీ పౌరుని జీవితంలోనూ ప్లాస్టిక్ భాగం అయింది.

వినియోగం మానలేమా ?

రూపాయి షాంపు ప్యాకెట్ మొదలుకొని, చిల్లర తిండ్లు, ఆయిల్ ప్యాకెట్లు, పాల ప్యాకెట్లు ఇలా ప్రతీ నిత్యావసర వస్తువు, ప్లాస్టిక్ సంబంధిత ప్యాకింగ్‌లోనే వస్తున్నాయి. ప్రత్యామ్నాయం కనిపించడం లేదని నూరుశాతం నిషేధించడం కుదరదని నిపుణులు చెబుతున్నారు. 40 మైక్రాన్ల (భూమిలో త్వరగా కలిసే ప్లాస్టిక్) వినియోగం కూడా పూర్తిస్థాయిలో సాధ్యం కాలేదు

రీసైక్లింగ్‌తో పరిష్కారం..

ప్లాస్టిక్ నిషేధించడం కంటే రీసైక్లింగ్‌కి యూనిట్లు నెలకొల్పి ప్రభుత్వమే నేరుగా స్థానిక సంస్థల ద్వారా ప్లాస్టిక్ వ్యర్థాలను కొనుగోలు చేసి భూమిలోనూ, నీటిలోనూ కలవకుండా చూడాలని నిపుణులు సూచిస్తున్నారు.

నెరవేరని ప్రధాని మోదీ కల..

2022 సంవత్సరాంతానికే దేశంలో పూర్తిస్థాయిలో ప్రమాదకర ప్లాస్టిక్‌ను నిషేధిస్తామని ప్రధాని మోదీ చెప్పినప్పటికీ ఆచరణలో సాధ్యం కాలేదు.

రోడ్ మ్యాప్ తయారు చేయాలి..

క్యారీ బ్యాగులు, ఇతర ప్రమాదకర ప్లాస్టిక్‌లను అమ్మకాలు జరిపే రిటైల్ షాపులపై దాడులు చేసి చేతులు దులుపుకోవడం కాకుండా, ఒక రోడ్ మ్యాప్ తయారు చేసి ప్లాస్టిక్ రీసైక్లింగ్‌కు నడుం బిగిస్తేనే ఫలితాలు ఉంటాయని మేధావులు సూచిస్తున్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ వ్యవసాయ కూలీ మృతి

పోడూరు, జూలై 2 : పాలకొల్లు- ఆచంట ప్రధాన రహదారిపై రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయమై చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన ఘటనపై మంగళవారం కేసు నమోదు చేశామని పోడూరు ఎస్ఐ డి.రామ్‌కుమార్ తెలిపారు. పెనుమదం పెదపేటకు చెందిన కుసుమే జయరాజ్ (55) వ్యవసాయ కూలీ గత నెల 24న పెనుమదం నుంచి గుమ్మలూరు బైక్‌పై వెళ్తున్నాడు. పైడావ రెల్లివారిపేటకు వచ్చేసరికి అదుపు తప్పి పడిపోయాడు. తలకు బలమైన గాయమైంది. స్థానికుల సమాచారంతో బంధువులు ఆటోలో పాలకొల్లు ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లారు. మెరుగైన వైద్యం నిమిత్తం భీమవరం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఆసుపత్రి సమాచారంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. భీమవరం ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

భర్తపై హత్యాయత్నం కేసు నమోదు

పాలకొల్లు రూరల్, జూలై 2 :పాలకొల్లు మండలం చింతపర్రు గ్రామానికి చెందిన బత్తిన నాగమునేంద్ర తన భార్యపై పెట్రోల్ పోసి హత్యా ప్రయత్నానికి పాల్పడ్డాడు. ఎస్ఐ డి.హరికృష్ణ తెలిపిన వివరాలివి.. నీతిపూడి రెబ్కాతో గత కొంతకాలంగా సహజీవనం చేస్తున్నాడు.. వీరికి ఒక కుమారుడు ఉన్నాడు. బాబు పుట్టిన తేదీ ధ్రువపత్రం విషయంలో మాటామాట పెరిగింది. దీంతో ఈ అఘాయిత్యానికి పాల్పడ్డాని తెలిపారు. ఈ ఘటనలో ఇద్దరికీ గాయాలయ్యాయి. పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

ఊరెళ్లి వచ్చేసరికి ఇంటిని దోచేశారు

» రూ.5 లక్షల విలువైన బంగారం, వెండి, నగదు చోరీ

పెనుమంట్ర, జూలై 2 : ఇంటికి తాళం వేసి ఊరు వెళ్లి వచ్చేసరికి ఇంటిలో దొంగతనం జరిగిన ఘటన పెనుమంట్ర మండలం పొలమూరులో ఆదివారం జరిగింది. పోలీసుల తెలిపిన వివరాలివి.. గ్రామంలోని కలిదిండి సుబ్రహ్మణ్యంరాజు ఇంటిలో అద్దెకు ఉంటున్న ఉపాధ్యాయుడు కడలి సత్యనారాయణ ఆదివారం సెలవు కావడంతో ఊరికి వెళ్లారు. సోమవారం తిరిగి వచ్చే సమయానికి తలుపులు తెరిచి ఇంటిలో వస్తువులు చల్లా చదరగా ఉండడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం క్లూస్ టీం వేలిముద్రలను సేకరించింది. కడలి సత్యనారాయణ ఇంటిలో ఐదు కాసుల బంగారం ఆభరణాలు, రూ. 50 వేలు విలువ చేసే వెండి వస్తువులు, రూ.50వేల నగదు, స్మార్ట్ ఎల్‌ఈడీ టీవీ, హోమ్ థియేటర్ చోరీకి గురయ్యాయని పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీటి విలువ సుమారు రూ.5 లక్షలు ఉంటుందని చెబుతున్నారు. ఈ ఘటనపై పెనుమంట్ర పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

వివాహిత ఆత్మహత్య.. ముద్దాయికి నాలుగేళ్ల జైలు

ఏలూరు క్రైం, జూలై 2 : ఒక వివాహితను చర్చిలో నుంచి బయటకు పిలిచి తిట్టి, కొట్టి, దుర్భాషలాడి అవమానించిన వ్యక్తిపై నేరం రుజువు కావడంతో నాలుగేళ్ల జైలు శిక్ష, మూడు వేల రూపాయలు జరిమానా విధిస్తూ ఏలూరులోని ఐదో అదనపు జిల్లా జడ్జి జి.రాజేశ్వరి మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం తూర్పు గోదావరి జిల్లా ఉండ్రాజవరం మండలం వేలివెన్ను గ్రామంలోని కొత్తపేట అంబేడ్కర్ నగర్‌కు చెందిన సిర్రా లక్ష్మణరావు 2020 మార్చి 15వ తేదీన ఆ గ్రామంలోని చర్చిలో ఉన్న ఒక వివాహితను బయటకు పిలిపించి అసభ్యంగా తిట్టి, కొట్టి, ఉరివేసుకుని చనిపోవాలని దూషించాడు. మనస్తాపానికి గురైన ఆ వివాహిత తన పిల్లలు ఇద్దరిని ఇంట్లో నుంచి బయటకు పంపి ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికులు గమనించి ఆసుపత్రికి తరలించిన అనంతరం మృతి చెందింది. ఈ ఘటనపై ఆమె భర్త ఫిర్యాదు మేరకు అప్పటి ఉండ్రాజవరం ఎస్ఐ ఎల్.అవినాశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేసి సిర్రా లక్ష్మణరావును అరెస్టు చేశారు. ఈ కేసులో నిందితుడైన లక్ష్మణరావుపై నేరం రుజువు కావడంతో నాలుగేళ్ళు జైలు శిక్ష, మూడు వేల రూపాయలు జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

పెన్షన్ సొమ్ము రూ.2.50 లక్షలతో పంచాయతీ కార్యదర్శి పరారీ

» పెన్షనర్లు ఇబ్బందులు పడకుండా మంత్రి సర్దుబాటు



బి.రాము

పాలకొల్లు రూరల్, జూలై 2: వృద్ధుల పెన్షన్ సొమ్ము తీసుకుని ఒక పంచాయతీ సచివాలయ కార్యదర్శి పరారైన ఘటన మండలంలోని లంకలకోడేరులో సోమవారం జరిగింది. లంకలకోడేరు సచివాలయం గ్రేడ్-5 కార్యదర్శి బి.రాము వృద్ధుల పెన్షన్ల సొమ్ము రూ.2,50,500లతో పరారయ్యాడు. ఈ సొమ్మును ఆదివారం రాత్రి అధికారుల నుంచి తీసుకుని సోమవారం వృద్ధులకు పంపిణీ చేయకుండా కనిపించకుండా వెళ్లిపోయాడు. పంచాయతీ కార్యదర్శి రాజేష్ సోమవారం పాలకొల్లు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. రాము స్వస్థలం భద్రాచలం వద్ద ఏజెన్సీలోని లంబాడీ తండాకు చెందిన వాడు, అతడికి మొగల్తూరు మండలం కాళీపట్నంలో కార్యదర్శిగా విధుల్లో జాయిన్ అయ్యాడు. భార్యభర్తల మధ్య విబేధాల కారణంగా అతడి భార్య గత కొంతకాలం క్రితం ఆత్మహత్య చేసుకుందని సమాచారం. ఈ నేపథ్యంలో రాము సస్పెండ్ అయ్యాడు. గత ఏడాది నవంబరులో లంకలకోడేరు సచివాలయంలో గ్రేడ్-5 కార్యదర్శిగా నియతులయ్యాడు. అతడికి ఆన్‌లైన్‌లో గేమ్స్ ఆడడం, క్రికెట్ బెట్టింగ్‌లు అలవాటు ఉందని సహచర ఉద్యోగులు చెబుతున్నారు. ఈక్రమంలో పెన్షన్ సొమ్ముతో పరార్ కావడం సంచలనంగా మారింది. ఈ నేపథ్యంలో వృద్ధులు ఇబ్బందులు పడకుండా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి డాక్టర్ నిమ్మల రామానాయుడు ఆ సొమ్మును సర్దుబాటు చేయడంతో వృద్ధులకు పెన్షన్లు సకాలంలో చెల్లించారు. సదరు ఉద్యోగిని తక్షణమే అరెస్టు చేసి సొమ్ములు రికవరీ చేయాలని పలువురు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.


కడమ్మ స్లూయిజ్‌కి మరమ్మతులు



కడమ్మ స్లూయిజ్‌కి సిబ్బంది మరమ్మతులు

పోలవరం, జూలై 2 : పోలవరం గ్రామ శివారున ఉన్న కడమ్మ స్లూయిజ్‌కి అఖండ గోదావరి రివర్ బండ్ అధికారులు మంగళవారం మరమ్మతులు నిర్వహించారు. ఏఈ సునీల్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది స్లూయిజ్ గేట్లకు మరమ్మతులు నిర్వహించి గ్రీజింగ్ పనులు చేశారు. కొండవాగుల నీరు గోదావరిలోకి వెళ్లేందుకు గత శతాబ్ద కాల చరిత్ర కలిగిన స్లూయిజ్ గేట్లు వరదల సమయాలలో పూర్తిగా మూసుకోకపోవడం వల్ల గోదావరి జలాలు పంట పొలాల్లోకి వెళ్ళడం, కొండ కాల్వల జలాలు గోదావ రిలోకి వెళ్లకపోవడం వల్ల ఏటా రెండువేల ఎకరాల పంటభూములు నీటము నిగి రైతులు నష్టపోతున్న నేపథ్యంలో మరమ్మతులు నిర్వహించినట్లు ఏఈ తెలిపారు.

పెరిగిన గోదావరి.. దిగువకు 43,878 వేల క్యూసెక్కులు



వరద జలాలు

పోలవరం ప్రాజెక్టులో గోదావరి నీటిమట్టం అనూహ్యంగా పెరిగింది. మంగళవారానికి నీటిమట్టం పెరగడంతో స్పిల్వే 48 గేట్ల నుంచి గోదావరి వరద జలాలు దిగువకు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. పోలవరం ప్రాజెక్టు స్పిల్వే ఎగువన 26.290 మీటర్లు, స్పిల్వే దిగువన 16.350 మీటర్లు, కాఫర్ డ్యాంకి ఎగువన 26.350 మీటర్లు, కాఫర్ డ్యాంకి దిగువన 15.130 మీటర్ల నీటిమట్టం నమోదైందని, అదనంగా వస్తున్న 43,878 వేల క్యూసెక్కుల వరద జలాలను దిగువకు విడుదల చేశామని ఈఈ పి.వెంకటరమణ తెలిపారు.

మిస్టరీగా.. బస్టాండ్‌లో బ్యాగ్ చోరీ

» దొంగతనంపై అనుమానాలు అనేకం..

నరసాపురం, జూలై 2: నరసాపురం బస్టాండ్‌లో సోమవారం రాత్రి జరిగిన బ్యాగ్ చోరీ మిస్టరీగా మారింది. దొంగతనంపై ఎన్నో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మంగళవారం దీనిపై పోలీసులు ఎటువంటి కేసు నమోదు చేయలేదు. బులియన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీఐ స్వామిని కలిసి చోరీ వివరాలను వివరించారు. ఫిర్యాదు రూపంలో ఇస్తే దర్యాప్తు చేస్తామని చెప్పడంతో వ్యాపారులు డీఎస్పీని కలవాలని నిర్ణయించుకున్నారు. గుంటూరుకు చెందిన పెద్ద వ్యాపారి గుమస్తా నరసాపురం పట్టణానికి సోమవారం కలెక్షన్, బంగారు ఆభరణాల ఆర్డర్ల నిమిత్తం వచ్చారు. సాయంత్రం వరకు సుమారు రూ.11 లక్షలు వసూలు చేసి, ఆభరణాలకు సంబంధించి సుమారు రూ.25 లక్షల విలువ చేసే 400 గ్రాముల బంగారాన్ని వ్యాపారుల వద్ద తీసుకున్నాడు. వీటిని బ్యాగ్‌లో పెట్టుకుని భీమవరం వెళ్లేందుకు ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చాడు. బస్సు రద్దీగా ఉండడంతో కిటికిలోంచి సీటులోకి బ్యాగ్ వేసి బస్సు ఎక్కాడు. అయితే సీటులో బ్యాగ్ లేకపోవడంతో వెంటనే చుట్టుపక్కల, బస్సు అంతా గాలించాడు. ఎక్కడా ఆచూకీ లేదు. ఈ విషయాన్ని గుంటూరులోని వ్యాపారికి, స్థానిక బులియన్ వర్తకులకు తెలియజేశాడు. మంగళవారం గుంటూరు నుంచి వచ్చిన ప్రధాన వ్యాపారి స్థానిక వ్యాపారులతో చర్చించాడు. కలెక్షన్, సేకరించిన బంగారం వివరాలను నమోదు చేసుకున్నాడు. కేసు పెట్టకపోవడంపై ఎన్నో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోయిన బంగారం, నగదు వివరాలను తెలపాల్సి వస్తే పన్నుపరమైన ఇబ్బందులు వస్తాయన్న ఉద్దేశంతోనే కేసు పెట్టలేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. దీన్ని బులియన్ వ్యాపారులు కొట్టి పారేస్తున్నారు. పోయిన నగదు అలయానికి సంబంధించిన విరాళాల మొత్తం అంటున్నారు. మరోవైపు చోరీపై ఎన్నో అనుమానాలు వినిపిస్తున్నాయి. కలెక్షన్ గుమస్తా వెనుక గుంటూరు నుంచి ఎవరైనా అనుసరించి వచ్చారా.. లేక స్థానికులా.. లేక గుమస్తానే మరికొంత మందితో కలిసి ఈ చోరీ నాటకం ఆడుతున్నారన్న అనే వదంతులు షికారు చేస్తున్నాయి. ఏది ఏమైనా సంచలనం రేకెత్తించిన ఈ కేసులో చిక్కుముడి వీడాలంటే దర్యాప్తు సాగాల్సిందే. ఇది జరగాలంటే కేసు నమోదు కావాలి.

ఆపరేషన్ చేస్తారనే భయంతో రోగి ఆత్మహత్య

» ఆసుపత్రి నాలుగో అంతస్తు నుంచి దూకిన వైనం



ఆసుపత్రిలో కిందపడుకుని ధర్నా చేస్తున్న గొల్లపూడి వాసి

ఏలూరు క్రైం, జూలై 2 : ఆసుపత్రిలో ఆపరేషన్ కోసం చేరిన ఒక రోగి తనకు ఆపరేషన్ చేస్తారనే భయంతో నాలుగో అంతస్తు నుంచి కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ముసునూరు మండలం గొల్లపూడికి చెందిన వేమూరి సత్యనారాయణ(40) కొంతకాలం నుంచి అనారోగ్యంతో ఉంటు న్నాడు. అతడిని కుటుంబ సభ్యులు ఏలూరు సమీపంలోని ఆశ్రం ఆసుప త్రిలో ఈనెల ఒకటో తేదీన చేర్పించారు. మంగళవారం పలు వైద్య పరీక్షలు నిర్వహించి రెండు రోజుల్లో ఆపరేషన్ చేస్తామని వైద్యులు మధ్యాహ్నం తెలియజేశారు. ఈ విషయం తెలుసుకున్న అతడు నాలుగో అంతస్తులోని తన రూమ్ బాత్‌రూమ్‌లోకి వెళ్లి మధ్యాహ్నం రెండు గంటల సమయంలో కిటికీ నుంచి కిందకు దూకడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఏలూరు రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. ఆ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నేలపై పడుకుని ధర్నాకు దిగారు. అతడి మరణానికి ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యమేనని ఆరోపించారు. చివరకు పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తామని చెప్పడంతో ధర్నా విరమించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం మంగళవారం రాత్రి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసును అనుమానస్పద మృతిగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్, మొబైల్ యాప్‌తో విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చు : పృథ్వీతేజ్

ఏలూరుసిటీ, జూలై 2: ఏపీఈపీడీసీఎల్ వినియోగదారులు విద్యుత్ బిల్లులను ఏపీఈపీడీసీఎల్ వెబ్‌సైట్, మొబైల్ యాప్ ద్వారా చెల్లించవచ్చని ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ఇమ్మడి పృథ్వీతేజ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇక మీదట ఫోన్‌పే, జీపే, పేటీఎం, ఇతర యూపీఐ యాప్స్ నందు విద్యుత్ బిల్లులు చెల్లించేటప్పుడు ఏపీఈపీడీసీఎల్ పేరు కనిపించదు, వినియోగదారులు సంస్థ మొబైల్ యాప్ ఈస్టరన్ పవర్‌ని గూగుల్ పే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని లేదా సంస్థ వెబ్‌సైట్ నుంచి గాని బిల్లులు చెల్లించవచ్చన్నారు. ఏపీఈపీడీసీఎల్ మొబైల్ యాప్‌లోగాని, లేదా సంస వెబ్‌సైట్‌లోగాని బిల్లులు చెల్లించేటప్పుడు వినియోగదారులు తమ ఫోన్‌పే, పేటీఎం, జీపే, ఇతర యూపీఐ యాప్స్‌తో పాటు డెబిట్, క్రెడిట్, నెట్ బ్యాంకింగ్, వాలెట్స్ , క్యాష్ కార్డ్స్ వాడుకోవచ్చని వినియోగదారులకు విజ్ఞప్తి చేశారు.

నేడు మూడు రైళ్ల దారి మళ్లింపు

ఏలూరు క్రైం, జూలై 2 : ఏలూరు మీదుగా నడిచే మూడు రైళ్లను బుధవారం దారిమళ్లిస్తున్నట్టు సౌత్ సెంట్రల్ రైల్వే శాఖ అధికారులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. విజయవాడ డివిజన్ పరిధిలోని గన్నవరం-పెదఅవుటుపల్లి మార్గమధ్యలో ట్రాఫిక్ మెయింటెనెన్స్ దృష్ట్యా విశాఖపట్టణం నుంచి కొల్లంకు ఈనెల 3వ తేదీన ఏలూరు మీదుగా వెళ్లే రైలు 08539ను, ధన్‌బాగ్-తామ్రం వెళ్లే రైలు 06066, బరైనీ- మంగళూరు సెంటర్ వెళ్లే రైలు 06094ను బుధవారం నిడదవోలు, గుడివాడ, విజయవాడ మీదుగా నడపుతున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో ఏలూరు, తాడేపల్లిగూడెం మీదుగా ఈ రైళ్ల రాకపోకలు బుధవారం ఉండవని ప్రయాణికులు గమనించాలని తెలిపారు.

నేడు పాలకొల్లులో ఆక్వా రైతుల జిల్లా మహాసభ

ఉండి, జూలై 2: పాలకొల్లులో బుధవారం నిర్వహించే ఆక్వా రైతుల జిల్లాస్థాయి మహాసభను విజయవంతం చేయాలని ఆక్వా రైతు, స్థానిక ఎంపీటీసీ రుద్రరాజు సూర్యనారాయణరాజు అన్నారు. మంగళవారం ఉండి మండలం కలిగొట్లలో ఆటో ద్వారా నిర్వహించిన ప్రచార కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఆక్వా పరిశ్రమ ఎదుర్కొంటున్న సంక్షోభంపై రాష్ట్ర, జిల్లాస్థాయి ఆక్వా సంఘం నాయకులు మహాసభలో చర్చిస్తారన్నారు. ఆక్వాకు సంబంధించి చేపలు, రొయ్యల మేతల ధరలు తగ్గించాలని, మందుల ధరలను తగ్గించాలని, ఆక్వా ఉత్పత్తులకు మంచి ధరలను కల్పించి రైతులను ఆదుకునే చర్యలు తదితర వాటిపై నూతన ప్రభుత్వానికి ఒక నివేదికను అందిస్తామన్నారు. జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఆక్వా రైతుల మహాసభ నిర్వహణ తెలిపేందుకు ప్రచారం నిర్వహిస్తున్నామన్నారు. అన్ని మండలాల నుంచి ఆక్వా రైతులు హాజరుకావాలన్నారు. కార్యక్రమంలో పలువురు ఆక్వారైతులు పాల్గొన్నారు.

మావుళ్ళమ్మ హుండీ ఆదాయం రూ.69 లక్షలు



హుండీల సొమ్మును లెక్కిస్తున్న సిబ్బంది

భీమవరం టౌన్, జూలై 2: మావుళ్ళమ్మ హుండీలను మంగళవారం తెరచి లెక్కించగా 92 రోజులకుగాను 69లక్షల 20వేల 286రూపాయలు ఆదాయం వచ్చిందని సహాయ కమిషనర్ బుద్దమహాలక్ష్మి నగేష్ తెలిపారు. నగదుతోపాటు 154 గ్రాముల బంగారం, 590 గ్రాముల వెండి వచ్చిందన్నారు. విదేశీ కరెన్సీ కూడా వచ్చిందన్నారు.



ఎమ్మెల్సీగా అభ్యర్థిగా హరిప్రసాద్ నామినేషన్‌కు అమరావతిలో మంగళవారం మద్దతు తెలిపిన ఎమ్మెల్యేలు బొలిశెట్టి శ్రీనివాస్, బొమ్మిడి నాయకర్, పత్సమట్ల ధర్మరాజు, తదితరులు

ఆన్‌లైన్ అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభం

కామవరపుకోట, జూలై 2 : ఏపీ ప్రభుత్వ ఉన్నత విద్యా మండలి ఆదేశాలతో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యాసంవత్సరానికి ఆన్‌లైన్ ద్వారా అడ్మిషన్ల ప్రక్రియను ప్రారంభించినట్టు ప్రిన్సిపాల్ కె.విజయబాబు మంగళవారం తెలిపారు. కళాశాలలో ప్రవేశాలు పొందాలనుకునే అభ్యర్థులు ఈ నెల 10వ తేదీ వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 11వ తేదీ నుంచి 15వ తేదీ వరకు దరఖాస్తుల పరిశీలన, వెబ్ ఆప్షన్లు నమోదు చేస్తామన్నారు. 19న సీట్ల కేటాయింపు జరుగుతుందన్నారు. 20 నుంచి 22 వరకు సీట్లు పొందిన విద్యార్థులు కళాశాలలో రిపోర్టు చేయాలన్నారు. 22వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని చెప్పారు. విద్యార్థినిలకు ఉచితంగా హాస్టల్ సదుపాయం కల్పించామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపల్ విజయబాబు సూచించారు.

బాలికల వసతి గృహాన్ని పునరుద్ధరించండి


ఎమ్మెల్యే బాలరాజుకు వినతిపత్రం ఇస్తున్న ఫ్రాన్సిస్

బుట్టాయగూడెం, జూలై 2 : మండల కేంద్రంలో గతంలో ఉన్న ఎస్సీ బాలికల వసతి గృహాన్ని తిరిగి పునరుద్ధరించాలని కోరుతూ కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్ ఎమ్మెల్యే చిర్రి బాల రాజుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. గతంలో జరిగిన చిన్నఘంటనతో వసతి గృహాన్ని మూసివేయడంతో వందలాది మంది బాలికలు చదువుకోడానికి ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. అలాగే జంగారెడ్డిగూడెంలోని గురుకుల పాఠశాలలో సీట్లు పెంచేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యేను కోరారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే బాలరాజు జిల్లా కలెక్టర్, పై అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వసతిగృహాన్ని తిరిగి ప్రారంభించడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు ఫ్రాన్సిస్ తెలిపారు.

పచ్చి రొట్టతో అధిక దిగుబడి

లింగపాలెం, జూలై 2: ఖరీఫ్‌లో 50 శాతం రాయితీ పై రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందజేశామని, పచ్చిరొట్ట వేసిన పంట పొలాల్లో దిగుబడి శాతం పెరుగుతుందని, జిల్లా వ్యవసాయ అధికారి హబీబ్ బాష పేర్కొన్నారు. లింగపాలెం మండలంలోని పంట పొలాలను మంగళవారం పరిశీలించిన ఆయన మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని సూచించారు. రైతు సేవా కేంద్రం సిబ్బంది పీఎం కిసాన్ ఐదు శాతం వెరిఫికేషన్‌ను త్వరగా పూర్తి చేయాలని అన్నారు. అనంతరం లింగపాలెంలోని రైతు సేవా కేంద్రాన్ని సందర్శించి రికార్డులు పరిశీలించారు. వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. మండల వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, రైతు సేవా కేంద్రం సిబ్బంది పాల్గొన్నారు.

సీఆర్‌ఆర్‌లో జాతీయ గణాంకాల దినోత్సవం

ఏలూరు అర్బన్, జూలై 2 : జాతీయ గణాంకాల దినోత్సవాన్ని మంగళవారం సీఆర్‌ఆర్ డిగ్రీ కళాశాలలో నిర్వహించారు. ప్రొఫెసర్ మహలనోబిస్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించే జాతీయ గణాంకాల దినోత్సవం ప్రాముఖ్యతను ప్రిన్సిపాల్ రామరాజు విద్యార్థులకు వివరించారు. నిత్య జీవితంలో గణాంకాల వినియోగం గురించి తెలిపారు. పద్మ విభూషణ్ అవార్డుతో భారత ప్రభుత్వం ప్రొఫెసర్ మహలనోబిస్‌ను గౌరవించిందని కరస్పాండెంట్ డాక్టర్ విష్ణుమోహన్ పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ విభాగం కరస్పాండెంట్ కలగర శివరామకృష్ణప్రసాద్, అధ్యాపకులు త్రినాథ్, మౌనిక, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో పరిశుభ్రతకు హెచ్‌ఎంలే బాధ్యులు

ఏలూరు అర్బన్, జూలై 2 : ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో పరిశుభ్రతకు హెచ్‌ఎంలే బాధ్యత వహించాలని డీఈవో అబ్రహం స్పష్టం చేశారు. నగరంలోని పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్, ఆహార పదార్థాల నాణ్యత తదితర అంశాలపై ఆకస్మిక తనిఖీలు చేసినట్టు డీఈవో మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తంగెళ్ళమూడిలోని శ్రీసూర్య హైస్కూలు పరిసరాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. డయేరియాపై విద్యార్థులకు అవగాహన కలిగించాలన్నారు. ఇదే ప్రాంతంలో ఉన్న మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో నూతన విద్యార్థుల ప్రవేశాలపై ఆరా తీశారు. జిల్లాలోని అన్ని పాఠశాలలను ఎంఈవోలు తనిఖీలు చేస్తూ ఉండాలని ఆదేశించారు.

సీజనల్ వ్యాధులపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

కుక్కునూరు, జూలై 2: సీజనల్ వ్యాధులపై ముందస్తూ జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య సిబ్బందిని జనసేన నాయకులు కోరారు. కుక్కునూరు పీహెచ్‌సీలో మంగళవారం ఆసుపత్రి వైద్యులు రమేష్, శ్రీనివాస్‌తో జనసేన మండల పార్టీ అధ్యక్షుడు ములిశెట్టి యుగంధర్ సమావేశమయ్యారు. సౌకర్యాలు వైద్య సిబ్బంది కొరత, సీజనల్ వ్యాధులపై తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సమాచారం పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు వద్దకు తీసుకెళ్ళి సమస్యలుంటే పరిష్కరిస్తామని యుగంధర్ తెలిపారు. జనసేన నాయకులు గోపాలకృష్ణ, వెంకన్నబాబు పాల్గొన్నారు.

శ్మశాన భూమి ఆక్రమణ తగదు

టి.నరసాపురం, జూలై 2: తూర్పు గూడెంకి చెందిన శ్మశాన భూమిని ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. టి.నరసాపురం పంచాయతీ లోని ఆర్‌ఎస్ నెంబర్ 293-1లో 2.46 ఎకరాల శ్మశాన భూమిని గతనెల జూన్ 26న గండిగూడెంకి చెందిన కొరివి శ్రీకాంత్ ఆక్రమించుకుని కొబ్బరి మొక్కలు నాటి ఆక్రమించుకున్నారి గ్రామస్తులు తెలిపారు. శ్రీకాంత్‌పై చట్టపరమైన చర్య లు తీసుకోవాలని వారు కోరారు.కోటమర్తి వెంకటేశు, రాయల పీరయ్య, బొడ్డపాటి వసంతరావు, బొక్కా శ్రీను, ఎన్.ప్రకాశరావు, ఎన్. సోమేశ్వరరావు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

- **ఏలూరు కార్పొరేషన్ :** యోగిని ఏకాదశి పర్వదినం సందర్భంగా మంగళవారం స్థానిక రామచంద్రరావుపేటలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద భక్తులు స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని జరిపారు. భగవద్గీత పారాయణ మండలి సభ్యులు సామూహికంగా భగవద్గీతను పఠించారు.
- ఏలూరు వన్ టౌన్‌లోని కోటదిబ్బ వద్ద గల గణపతి త్రిదేవి పీఠం ప్రాంగణంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద మంగళవారం ఆలయ ధర్మకర్త చిందా రాజు భక్తులకు అన్నప్రసాద వితరణను నిర్వహించారు. పాండురంగ సెంటర్‌లోని దాసాంజనేయస్వామి కోవెల వద్ద ఆలయ నిర్వాహకులు 603 మందికి అన్నప్రసాద వితరణను నిర్వహించారు.
- అంతర్జాతీయ కృష్ణ చైతన్య సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 15న ఏలూరు నగరంలో శ్రీజగన్నాథ రథయాత్ర మహోత్సవాన్ని నిర్వహిస్తున్నట్టు ఇస్కాన్ సంస్థ ప్రతినిధులు తెలిపారు.
- **జంగారెడ్డిగూడెం :** మద్దిఆంజనేయస్వామి దర్శనానికి మంగళవారం భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి ఆలయం చుట్టూ 108 ప్రదక్షణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. వివిధ సేవల ద్వారా రూ.1,88,242లు వచ్చినట్లు ఈఓ ఆకుల కొండలరావు తెలిపారు.
- **నిడమర్రు :** అడవికొలను లో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత కేశవ స్వామి ఆలయంలో జ్యేష్ట బహుళ ఏకాదశి పర్వదిన సందర్భముగా పరిమళ పుష్ప వైభవంగా నిర్వహించారు.

చెత్త పన్ను వసూళ్లు నిలిపివేత

» కూటమి ప్రభుత్వం రద్దు చేయడంతో ఉపశమనం » గత వైసీపీ ప్రభుత్వంపై ప్రజల అసహనం

దేశంలో ప్రజల పై చెత్త పన్ను వేసిన చెత్త ప్రభుత్వం ఏదైన ఉందంటే అది వైసీపీ ప్రభుత్వమే. అందుకే వైసీపీని ప్రజలు చెత్త బుట్టలోకి విసిరేశారు. ఎన్నికల ముందు వాగ్దానం చేసినట్లుగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చెత్తపన్ను వసూళ్లు నిలిపివేయమని ముఖ్యమంత్రి చంద్రబాబు మౌకిక ఆదేశాలు జారీ చేసి మాట నిలబెట్టుకున్నారు. దీంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.


చెత్త తీసుకు వెళ్లే వాహనం

ఏలూరు టూ టౌన్, జూలై 2: స్వచ్ఛాంధ్ర, జగనన్న స్వచ్ఛ సంకల్పం పేరుతో 2021 అక్టోబర్ 2న వైసీపీ ప్రభుత్వం చెత్తపన్ను వసూళ్ల ప్రారంభించింది. చెత్తను మూడు రకాలుగా వేరు చేసి తడి చెత్త ఒక బుట్టలో, పొడిచెత్త ఒక బుట్టలో, గాజుపెంకులు, ప్లాస్టిక్ లాంటి వేస్ట్ మెటీరియల్ వేయడానికి మరో బుట్ట ఇంటింటికి సరఫరా చేసింది. ఇలా సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులో వేయడానికి ప్రభుత్వం 61 వాహనాలు కొనుగోలు చేసింది. ఈ వాహనాలకు నెలకు రూ.34 వేలు బ్యాంకులకు ఈఎంఐలు కట్టాలని నగర పాలక సంస్థ పై భారం మోపింది. ఒక్కో వాహనం ఖరీదు రూ.63 వేలు. వీటికి ఈఎంఐలు కట్టడాని సర్‌ఛార్జీ పేరుతో చెత్త పన్నులు విధించింది. అయితే నగరంలో 70 వేల కుటుంబాలు ఉంటే వాటిలో సగం కుటుంబాలకే పంపిణీ చేశారు. మిగిలినవన్ని శానిటరి ఇన్‌స్పెక్టర్ల ఆఫీసుల్లో మూలుగుతున్నాయి.

ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత

చెత్త పన్ను వసూళ్లను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించడంతో నాటి ప్రతిపక్ష టీడీపీ, జనసేన, వామపక్షాలు ప్రజలకు మద్దతు పలికాయి. అయినప్పటికి ప్రభుత్వం బలవంతంపు వసూళ్లకు పాల్పడింది. సచివాలయ, పారిశుధ్య సెక్రటరీలపై టార్గెట్‌లు విధించింది. దీంతో సెక్రటరీలు ఉదయం ఆరు గంటలకు ఇంటింటికి వెళ్లి చెత్త పన్ను కట్టకపోతే, తాగునీటి కుళాయి కట్ చేస్తామంటూ బెదిరింపులకు దిగారు. దీంతో ప్రజలు తప్పని పరిస్థితిల్లో బలవంతంగా చెత్త పన్ను కట్టారు. అయితే చాలా మంది ఎదురు తిరగడంతో సచివాలయ సిబ్బంది చేతులెత్తేశారు.

వసూళ్ల లక్ష్యం రూ.9 కోట్లు

మంచి కరోనా వచ్చి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న తరుణంలో జూలై 2021లో జగన్ ప్రభుత్వం చెత్తపన్ను వసూలు ప్రారంభించింది. అప్పటి నుంచి మే 30వ తేదీ వరకు రూ.తొమ్మిది కోట్ల 94 లక్షల 26 వేల 727లు వసూలు చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇప్పటి వరకు రూ.ఆరు కోట్ల ఐదు లక్షల 14 వేల 950లు ప్రజల నుంచి చెత్తపన్ను వసూలు చేశారు. ఇంకా రూ.మూడు కోట్ల 89 లక్షల 11 వేల 777లు వసూలు చేయాల్సి ఉండగా ఈలోపు వైసీపీ ప్రభుత్వాన్ని ప్రజలు ఇంటికి పంపారు.

కేటగిరి	ఇప్పటి వరకు వసూళ్లు ఇలా..
స్లమ్ ఏరియా ఇళ్లకు	60
సాధారణ ఇళ్లు	100
1000 ఎస్ఎఫ్‌టీ పైన హోటళ్లు	1,500
1000 ఎస్ఎఫ్‌టీ లోపు హోటళ్లు	1,000
బార్‌అండ్ రెస్టారెంట్లకు	3,000
రోడ్డుసైడు వ్యాపారులకు	350
ఫైవ్‌స్టార్ హోళ్లకు	15,000
త్రిస్టార్ హోటళ్లకు	10,000
లాడ్జీలకు	3,000-5,000
చికెన్ మటన్ షాపులకు	300
కమర్షియల్ కంప్లేక్స్‌లకు	1,000-5,000
సినిమా థియేటర్లకు	2,500
విద్యా సంస్థలకు	500-3,000
ఆసుపత్రులకు	1,500-10,000
పంక్షన్ హాళ్లకు	4,000-15,000

ఆస్తి పన్నులో భాగంగానే చెత్త పన్ను కూడా ఉంటుంది. ఒక పక్క ఆస్తి పన్ను పెంచి మరో పక్క చెత్త పన్ను కూడా కట్టమనడంతో ప్రజల్లో ఆగ్రహావే శాలు పెల్లుబుకాయి.

చెత్త పన్ను నిలిపివేశాం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చెత్తపన్ను వసూళ్ల నిలిపివేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు మౌఖిక ఆదేశాలు జారీ చేశారు. దీంతో చెత్త పన్ను వసూళ్ల నిలిపివేశాం.

- సంక్రాంతి వెంకటకృష్ణ, కమిషనర్, నగరపాలక సంస్థ

ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న వారికి పింఛన్ల పంపిణీ


కాకినాడలోలో చికిత్స పొందుతున్న సుబ్బలక్ష్మికి పింఛను అందజేస్తున్న జంగారెడ్డిగూడెం సిబ్బంది


విజయవాడ ఆస్పత్రిలో పెద్దిరాజుకు పింఛన్ పంపిణీ చేస్తున్న క్రొవ్విడి సచివాలయ సిబ్బంది


ఏలూరులో చికిత్స పొందుతున్న వృద్ధునికి పింఛను సొమ్ము అందిస్తున్న టీడీపీ నేతలు

చింతలపూడి, జూలై 2: స్థానిక వెలమపేటకు చెందిన పూడి అమ్మాజీ అనారోగ్యంతో ఉంగుటూరులో ఉండగా విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్, సచివాలయ సిబ్బందిని ఉంగుటూరుకు పంపి వృద్ధాప్య పింఛన్‌ను పంపిణీ చేయించారు. దీంతో ఆమె కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు.

- జంగారెడ్డిగూడెం : చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ ఆదేశాల మేరకు పట్టణ టీడీపీ అధ్యక్షుడు రావూరి కృష్ణ ఆధ్వర్యంలో రాజమండ్రి ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పట్టణానికి చెందిన అగస్తి కమలకుమారికి, 21వ వార్డు వెల్ఫేర్ సెక్రటరీ జి.రవి, కాకినాడ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కంచర్ల సుబ్బలక్ష్మికి 9వ వార్డు వెల్ఫేర్ సెక్రటరీ ఆర్.యుగేశ్వర్ మంగళవారం వెళ్లి పింఛను అందచేశారు. టీడీపీ నాయకుడు గుళ్ళపూడి రమేష్ ఉన్నారు.
- నిడమర్రు : క్రొవ్విడికి చెందిన కొమ్మలపాటి పెద్దిరాజు గత నెల రోజులుగా ఆపరేషన్ చేయించుకొని విజయవాడ పిన్నమనేని సిద్దార్థ ఆస్పత్రిలో లేవలేని పరిస్థితిలో ఉండడంతో అంగాన్‌వాడీ టీచరు బీవీ ప్రేమలత అక్కడకు వెళ్లి పింఛన్ అందజేశారు. జిల్లా తెలుగు యువత ప్రధాన కార్యదర్శి మహ్మద్ గఫ్ఫార్‌ఖాన్ హర్షం వ్యక్తం చేశారు.
- పెదవేగి : వేగివాడకు చెందిన కాట్రు చినగాగులు అనే వృద్ధుడు అనారోగ్యంతో ఏలూరు సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వేగివాడ సచివాలయ ఉద్యోగి ఆస్పత్రికి వెళ్లి పింఛను సొమ్మును అందించారు. టీడీపీ నాయకులు చేకూరి భగవాన్, బొకినాల రాంబాబు పాల్గొన్నారు.

99.16 శాతం పింఛన్ల పంపిణీ

కామవరపుకోట, జూలై 2 : కూటమి నేతలు పట్టుదలతో మండలంలోని 8,211 మందికి గాను 8,142 మందికి పింఛన్ల పంపిణీ పూర్తి చేశామని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు కిలారు సత్యనారాయణ మంగళవానం తెలిపారు. మిగిలిన 69 మందిలో 58 మంది మృతి చెందగా, 11 మంది ఇతర ప్రదేశాల్లో ఉన్నారని చెప్పారు. ఈ కార్యక్రమానికి సహకరించిన కూటమి నేతలకు చింతలపూడి ఎమ్మెల్యే సొంగా రోషన్‌కుమార్ అభినందనలు తెలిపారన్నారు. కొండగూడెంలో జరిగిన పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు ఘంటా సుధీర్‌బాబు, కోనేరు వెంకట సుబ్బారావు, పండు జగదీష్, నెక్కలపు గంగాధరరావు, నెక్కలపు సూర్యనారాయణ, బొబ్బిలి డాన్ దివాకర్, కోనేరు వెంకట్రామయ్య(బుజ్జి), కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు రోటరీ క్లబ్‌కు అవార్డుల పంట



అవార్డులు స్వీకరిస్తున్న క్లబ్ సభ్యులు

ఏలూరు రూరల్, జూలై 2: విజయవాడలో జరిగిన రోటరీ అవార్డ్స్ నైట్ కార్యక్రమంలో ఉత్తమ సామాజిక సేవలకు గాను రోటరీ క్లబ్ ఆఫ్ ఏలూరు వారికి అవార్డుల పంట పండింది. క్లబ్ అధ్యక్షుడు రోహిత్‌కు బెస్ట్ క్లబ్ ప్లాటినమ్ అవార్డుతో పాటు మొత్తం 17 అవార్డులు లభించినట్లు రోహిత్ తెలిపారు. ఈ సందర్భంగా పాస్ట్‌డిస్ట్రిక్ గవర్నర్ డాక్టర్ దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ భవిష్యత్తులో క్లబ్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. క్లబ్ అధ్యక్షుడిగా రోహిత్ పదవీ కాలం ముగియడంతో ఆయన స్థానంలో స్వామి త్వరలో బాధ్యతలు స్వీకరిస్తారన్నారు.

అల్లూరిని ఆదర్శంగా తీసుకోవాలి


బుక్స్ అందజేస్తున్న సభ్యులు

ఏలూరు టూ టౌన్, జూలై 2: మన్యం వీరుడు అల్లూరి సీతారా మరాజును ఆదర్శంగా తీసుకోవాలని మాజీ ఎమ్మెల్సీ రామ్ సూర్యారావు అన్నారు. నగరంలోని పాఠశాలల్లో, కళాశాలల్లో మంగళవారం అల్లూరి జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రప టానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బహుజన ఆఫీ సర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షులు దేవరకొండ వెంకటేశ్వర్లు ముద్రించిన పుస్తకాలను విద్యార్థులకు అందజేశారు. ఏవీఆర్ విజ్ఞాన కేంద్రం కార్యదర్శి నరసింహారావు ఆధ్వర్యంలో నిర్వహించారు.

రోడ్డు సమస్యపై ఎమ్మెల్యే రోషన్‌కు వినతి

చింతలపూడి, జూలై 2: చింతలపూడి-టి.నరసాపురం రోడ్డు ప్రమాదకరంగా మారిందని, విస్తరణ, మరమ్మతు పనులు త్వరగా పూర్తి చేయించాలని చింతలపూడి ఎమ్మెల్యే రోషన్‌కుమార్‌కు మంగళవారం సామాజిక కార్యకర్త నాజర్ పాష వినతిపత్రం అందజేశారు. గ్రీన్‌ఫీల్డ్ రోడ్డుకు మెటీరియల్ తరలించే లారీలు అధికంగా తిరుగుతున్నాయని, ఇదే మార్గంలో విద్యార్థులు నిత్యం పాఠశాల సమయాల్లో ప్రయాణం చేస్తుంటారని, ఏ రోజున ఏం జరుగుతుందో భయంగా ప్రజలు గడుపుతున్నారని పేర్కొన్నారు. దీంతో పాటు తెలంగాణ సరిహద్దు అల్లిపల్లి రోడ్డు కూడా మరమ్మతు చేయాలని సూచించారు. డంపింగ్ యార్డుకు స్థలం కేటాయించాలని కోరారు. ఆయనను కలిసిన వారిలో గుంపావలీ, లతీఫ్ ఉన్నారు.

కొత్త చట్టాలపై ఖైదీలకు అవగాహన


కొత్త చట్టాలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు, న్యాయవాదులు

ఏలూరు క్రైం, జూలై 2 : ఏలూరు జిల్లా జైలులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న పలువురికి కొత్త చట్టాలపై అధికారులు, న్యాయవాదులు మంగళవారం అవగాహన కల్పించారు. జిల్లా జైలు సూపరిం టెండెంట్ సీహెచ్‌ఆర్‌వీ స్వామి ఆధ్వర్యంలో నూతన చట్టాలపై ఖైదీలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బ్రిటిష్ కాలం నాటి చట్టాలు ప్రస్తుత కాలానికి అనుగుణంగా లేకపోవడంతో కొత్త చట్టాలను కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా అమలులోకి తెచ్చిందన్నారు. న్యాయవాది కూనా కృష్ణారావు చట్టాలపై అవగాహన కల్పించారు. న్యాయవాదులు తాళ్ళూరి మధు, లయన్స్ జిల్లా నాయకులు ఎల్.వెంకటేశ్వరరావు, జిల్లా జైలర్స్ వెంకటరెడ్డి, శ్రీనివాసరావు, డిప్యూటీ జైలర్లు కె సత్యనారాయణ, కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

'యాదవుల సంక్షేమానికి కృషి చేస్తా'


చింతయ్యను సత్కరిస్తున్న సభ్యులు

ఏలూరు రూరల్, జూలై 2: యాదవుల సంక్షే మానికి చిత్త శుద్ధితో కృషి చేస్తానని, జిల్లా యాదవ సం ఘం అధ్యక్షుడిగా ఎన్నికైన మొమ్మిడి చింతయ్య అన్నారు. స్థానిక యాదవ సంఘం భవనంలో మంగళవారం జిల్లా యాదవ సంఘం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఏలూరు జిల్లా అధ్యక్షుడిగా మొమ్మిడి చింత య్య, కార్యదర్శిగా బొమ్మన బోయిన నాని, నగర అధ్యక్షుడిగా మెరుగు మాల శ్రీనివాసరావు, కార్యదర్శిగా గుమ్మడి సూర్యనారాయణను ఎన్నుకు న్నారు. అధ్యక్షుడిగా ఎన్నికైన చింతయ్య మాట్లాడుతూ జిల్లా యాదవ సంఘం భవన నిర్మాణానికి రూ. రెండు లక్షల విరాళాన్ని ప్రకటించారు. రాష్ట్ర నాయకుడు నెరుసు వెంకట సుబ్బయ్య మాట్లాడుతూ ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌యాదవ్ సహకా రంతో ముందుకు వెళతామన్నారు. ఇసుకపల్లి తాతారావు, కాట్రుబాలు, గోపాలకృష్ణ, చిదరబోయిన శ్రీనివాస రావు, మల్లిపూడి రాజు, కిలారపు జగదీష్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రెండో రోజుకు టీచ్ టూల్

భీమడోలు, జూలై 2 : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న టీచ్ టూల్ శిక్షణ కార్యక్రమం రెండో రోజుకు చేరుకుంది. శిక్షణ కార్యక్రమం పరిశీలకురాలిగా రాష్ట్ర సమగ్ర శిక్షణ కో ఆర్డినేటర్ మాధవీలత పాల్గొన్నారు.

వ్యాధులకు మూలం దోమలే



ఎర్రగొండపల్లిలో ర్యాలీ చేస్తున్న ఆరోగ్య సిబ్బంది

చింతలపూడి, జూలై 2: వ్యాధులకు మూలం దోమలేనని, ఇంటి పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని ఎర్రగొండపల్లి పీహెచ్‌సీ వైద్యులు నరేష్ అన్నారు. పీహెచ్‌సీ నుంచి ఆరోగ్య శాఖ సిబ్బంది మంగళవారం మలేరియా మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఇంటి పరిసరాల్లో పరిశుభ్రత పాటించాలని సూచించారు. ఆరోగ్య కార్యకర్తలు అవగాహన కల్పించాలన్నారు. ర్యాలీలో మెడికల్ ఆఫీసర్ ఎన్.గీత, మలేరియా సబ్‌యూనిట్ అధికారి ఎన్‌ఏ ప్రసాద్, ఎంపీహెచ్‌ఈవో శ్రీనివాసరావు, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

- ఉంగుటూరు : చేబ్రోలు, కాగుపాడు పీహెచ్‌సీలలో డెంగీ నివారణ మాసోత్సవాలలో భాగంగా అవగాహన సదస్సులు, ఆరోగ్య సిబ్బందితో ర్యాలీలు నిర్వహించారు. తాడేపల్లిగూడెం మలేరియా యూనిట్ ఉప ఆరోగ్య అధికారి వైవీ లక్ష్మణరావు ఆధ్వర్యంలో వైద్యులు కేఎస్ వర్మ, శ్రావణ్ రెడ్డి, మానస, సాయి అనూష పాల్గొన్నారు.
- టి.నరసాపురం : కేతవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో అతిసార వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వ్యాధులు ప్రబలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కేతవరం సామాజిక ఆరోగ్య అధికారి సీహెచ్‌కే రాజు, హెచ్‌ఎంలు అప్పారావు, టి.మల్లయ్య, ఏఎన్‌ఎంవై ఏసుమరియ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.
- పెదవేగి : స్థానిక పీహెచ్‌సీ ఆవరణలో నిర్వహించిన ఆశాడే కార్యక్రమంలో వైద్య సిబ్బందికి వర్షాకాలంలో ఆరోగ్య సంరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ మాధవి అవగాహన కల్పించారు. డాక్టర్ ప్రత్యూష, సీహెచ్‌వో డి.రోజ్‌మేరీ, ఏఎన్‌ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.
- లింగపాలెం : వర్షాకాలం ప్రారంభమవ్వడంతో దోమల వ్యాప్తి పెరిగి వ్యాధులు ప్రబలే అవకాశముందని, కె.గోకవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కృష్ణకిషోర్ అన్నారు. పీహెచ్‌సీ పరిధిలో మంగళవారం ఆయన వైద్య పరీక్షలు నిర్వహించారు. వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి తిరిగి రక్త నమూనాలు సేకరించాలని సూచించారు. పంచాయతీ సిబ్బందితో కలిసి శానిటేషన్, ఫాగింగ్ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విజయవాడకు ఏసీ స్లీపర్ బస్సు



బస్సును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే చంటి

ఏలూరు టూ టౌన్, జూలై 2: ఏలూరు ఆర్టీసీ కొత్త బస్టాండ్ నుంచి విజయ వాడకు ప్రయాణికుల సౌక ర్యార్థం స్టార్ ల్యాండ్ ఏసీ స్లీపర్ కోచ్ బస్సును ఎమ్మె ల్యే బడేటి రాధా కృష్ణయ్య (చంటి) మంగళవారం ప్రారంభించారు. ఈ బస్సును ఎమ్మెల్యే చంటి కొంతదూరం నడిపారు. కార్యక్రమంలో ఆర్టీసీ అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

శ్రీవారికి కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి పూజలు


వేదాశీర్వచనం పొందుతున్న కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి

ద్వారకాతిరుమల, జూలై 2: చిన్నతిరుమలేశుని ఆలయాన్ని కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మంగళవారం ఉదయం సందర్శించారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు జరుపుకున్నారు. అనంతరం ఆలయ అర్చకులు ఆయనకు స్వామివారి శేషవస్త్రాన్ని కప్పి వేదాశీర్వచనం పలికారు. ప్రసాదాలను అందించారు.

నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించండి


మంత్రి నారా లోకేష్ కు అభినందనలు తెలుపుతున్న ముస్తఫా

జంగారెడ్డిగూడెం, జూలై 2 : రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనారిటీలకు నామినేటెడ్ పదవుల్లో ప్రాముఖ్యత కల్పించాలని మంత్రి నారా లోకేష్‌ను కోరినట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా మాజీ వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ ముస్తఫా తెలిపారు. ఉండవల్లిలో నారా లోకేష్‌ను మంగళవారం ముస్తఫా మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. కూటమి ప్రభు త్వం బడుగు, బలహీన వర్గాల వారికి సముచిత స్థానం కల్పిస్తుందని మంత్రి లోకేష్ భరోసా ఇచ్చినట్లు ముస్తఫా తెలిపారు.

కుంగిన రోడ్డుకు మరమ్మతులు

వేలేరుపాడు, జూలై2: గ్రామంలోని రహదారి భారీ గోతులతో అధ్వానంగా ఉండడతో 20 రోజుల క్రితం ఆర్‌అండ్‌బీ అధికారులు ఆగమేఘలా మీద మరమ్మతు పనులు చేపట్టారు. గోతులుపడిన ప్రాంతంలో మట్టితో పూడ్చి ఆ పై కంకర వేసి తారు పోశారు. అయితే కొద్ది రోజులకే ఈ రహదారి కుంగిపోయి మరలా గోతులు ఏర్పడ్డాయి. రహదారి మరమ్మతు పనుల్లో జరిగిన అవకతవకల పై 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైంది. స్పందించిన ఆర్‌అండ్‌బీ అధికారులు గతంలో వేసిన మట్టి, కంకరను పూర్తిగా తొలగించి తిరిగి కంకరవేసి రోలింగ్ చేశారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున తారువేయడం లేదని ఎండలు వచ్చిన తరువాత వేస్తామని ఆర్‌అండ్‌బీ సిబ్బంది తెలిపారు.

క్రైం కార్నర్

ఆటో డ్రైవర్ల మధ్య ఘర్షణ


రమేష్‌ను పరామర్శిస్తున్న నాయకులు

ఏలూరు క్రైం, జూలై 2 : ప్రయాణికులను ఆటో ఎక్కించుకునే సమయంలో ఆటో డ్రైవర్ల మధ్య వివాదం తలెత్తడంతో ముగ్గురు గాయాలపాలయ్యారు. ఏలూరు పాత బస్టాండ్ వద్ద దెందులూరు మండలం కొవ్వలికి చెందిన మాత్రపు రమేష్ ప్రయాణికులను తన ఆటోలో ఎక్కించుకుంటుండగా అదే గ్రామానికి చెందిన కీర్తిసునీల్, సుధాకర్ తమకు సీరియల్ ఉందని ప్రయాణికులను ఎక్కించుకోవద్దంటూ వారించడంతో ఆటో డ్రైవర్ల మధ్య ఘర్షణ తలెత్తి దాడులకు తెగబడ్డారు. గాయాలైన ముగ్గురు ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో ఎమ్మెల్సీలుగా నమోదు చేయించుకున్నారు. ఈ సంఘటనపై ఏలూరు టూ టౌన్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

- ఆటో డ్రైవర్‌పై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ ప్రధాన కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్, జిల్లా ఉపాధ్యక్షులు బి.సోమయ్య, ఏలూరు నగర నాయకులు పి.కిషోర్, సాయిబాబు డిమాండ్ చేశారు. ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆటో డ్రైవర్ మాత్రపు రమేష్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా రమేష్‌పై, ఏలూరు జిల్లా ఆటో డ్రైవర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.గోపీ, ఏలూరు టౌన్ యూనియన్ నాయకుడు లీలా కృష్ణ తన అనుచరులతో దాడి చేయడం జరిగిందన్నారు. వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రెండు బైక్‌లు ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు

చింతలపూడి, జూలై 2: ఎదురెదురుగా వస్తున్న రెండు మోటారు సైకిళ్లు ఢీకొట్టుకోవడంతో ఒకరికి తీవ్రగాయాలైన ఘటన చింతలపూడి పట్టణంలోని ఏలూరు రోడ్డులో మారుతీనగర్ వద్ద జరిగింది. చింతలపూడి పోలీసులు తెలిపిన వివరాలివి.. మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఈ ప్రమాదంలో టి.నరసాపురం మండలం మక్కినవారిగూడెంకు చెందిన అబ్బదాసరి వెంకటేశ్వరరావు బైక్ నుంచి కిందపడిపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. అదే సమయంలో పామాయిల్ లోడ్‌లారీ అతడి కాలుపై నుంచి దూసుకుపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. అతడిని ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు చింతలపూడి పోలీసులు కేసు నమోదు చేశారు.

ఇంటి వివాదం.. ఒకరిపై ఒకరు కేసులు

లింగపాలెం, జూలై 2: లింగపాలెం మండలం భోగోలులో ఇంటిస్థలం విషయమై ఒకరిపై ఒకరు దాడి చేసుకున్న ఘటన మంగళవారం జరిగింది. ఎస్‌ఐ చెన్నారావు తెలిపిన వివరాలివి.. భోగోలుకు చెందిన బండా కృష్ణకుమారి, నరదల పకీరమ్మ తమ ఇంటిస్థలం విషయమై వివాదం జరిగినట్టు తెలిపారు. ఇరువర్గాలు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నట్టు తెలిపారు. ఒకరిపై ఒకరు పరస్పరం కేసులు పెట్టుకున్నట్టు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

ట్రిపుల్ ఐటీని ఆకస్మికంగా సందర్శించిన మంత్రి



నూజివీడు టౌన్, జూలై 2: ఆర్జీయూకేటీ అడ్మిషన్ల వేళ రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖా మంత్రి కొలుసు పార్థసారథి, నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ముందస్తు సమాచారం ఇవ్వకుండా మంగళవారం సాయంత్రం నూజివీడు ట్రిపుల్ ఐటీకి వెళ్ళిన మంత్రి ట్రిపుల్‌ఐటీ అడ్మిషన్ల ప్రక్రియపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ట్రిపుల్ ఐటీలో హెచ్‌వోడీలతో ఆయన సమావేశమై ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల ప్లేస్‌మెంట్‌లను పెంచే దిశగా చర్యలు చేపట్టాలని, ఎటువంటి సమస్యలున్నా నేరుగా తమ దృష్టికి తేవాలని మంత్రి అధికారులకు సూచించారు. అనంతరం ఆయన విద్యార్థులతో మాట్లాడారు.

విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు



కైకలూరు, జూలై 2: విద్యుత్ చౌర్యానికి పాల్పడితే కేసులు నమోదు చేస్తామని విద్యుత్ శాఖ డీఈ రామకృష్ణ తెలిపారు. మంగళవారం కైకలూరు రూరల్ పరిధిలో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. సెక్షన్ లోడు కన్నా అదనంగా వాడుతున్న 24 మందిపై కేసులు నమోదు చేసి రూ. 85 వేలు, మూడు బ్యాక్ బిల్లింగ్ కేసుల్లో రూ.15 వేలు అపరాధ రుసుం విధించినట్టు తెలిపారు. అలాగే ఎవరైనా అదనపు లోడు వినియోగిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎక్కడైనా విద్యుత్ చౌర్యాలకు పాల్పడితే విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ ఫోన్ నెంబరు 94408 11790కు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. ఈ తనిఖీలలో విజిలెన్స్ డీఈ పూర్ణచంద్రరావు, ఏఈ పి. వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.



స్వచ్ఛందంగా రహదారి మరమ్మతులు

కలిదిండి, జూలై 2 : అధ్వానంగా ఉన్న లంక గ్రామాల ప్రధాన రహదారికి కూటమి నాయకులు, రైతులు మంగళవారం స్వచ్ఛందంగా మరమ్మతు పనులు ప్రారంభించారు. ఆంధ్రజ్యోతిలో గత నెల 28న 'నడక యాతన' శీర్షికన ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి రైతులు, కూటమి నాయకులు స్పందించారు. గుర్వాయిపాలెం నుంచి పెదలంక వరకు సుమారు 16 కిలోమీటర్ల మేర రహదారిపై పడిన గోతులను ఎక్స్‌కవేటర్‌తో చదును చేసి కంకరతో పూడ్చుతున్నారు. వాహనాల రాక పోకలకు అంతరాయం కలుగకుండా రోడ్డు మరమ్మతులు చేస్తున్నామని తెలిపారు. కూటమి నాయకులు పోకల జోగిరాజు, వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, ముద్దం భోగేశ్వరరావు, వెంకటాచలం, సారిక వెంకటేశ్వరరావు, దున్న భోగేశ్వరరావు, సతీష్ రాజు, వేగిరెడ్డి చిన్నారావు, రైతులు పాల్గొన్నారు.

దాత సహకారంతో పాఠశాలలో మెరక పనులు



మండవల్లి, జూలై 2: మండవల్లి జడ్పీ హైస్కూల్ ఆవరణ మెరక పనులను కూటమి నాయకుడు చాపరాల దుర్గా ప్రసాద్ ఆర్థిక సాయంతో మంగళవారం చేపట్టారు. ప్రధానమంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండి యా (పీఎంశ్రీ) పథకం కింద మండవల్లి జడ్పీ ఉన్నత పాఠశాల ఎంపికవ్వడంతో దాతల సహకారంతో స్కూలులో అనేక పనులు చేపట్టారు. ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ సూచనతో దాతలు ముందుకు వచ్చారు. స్కూలులోని గుంతలను, ఆవరణ మెరక పనులు కూటమి మండల నాయకుడు చాపరాల దుర్గాప్రసాద్ ఆర్థిక సాయంతో పనులు చేపట్టగా పనులు నిర్వహణను దాతతో పాటు విద్యాకమిటీ మాజీ ఛైర్మన్ ముళ్లపూడి సత్తిబాబు పర్యవేక్షించారు. ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ మాట్లాడుతూ పీఎంశ్రీ పథకం కింద స్మార్ట్ క్లాసు రూములు, డిజిటల్ లైబ్రరీ, క్రీడా పరికరాలు, ఇంటర్నెట్ సౌకర్యం ఏర్పడుతుందని తెలిపారు. క్రీడా పరికరాలకు రూ.5 లక్షలు మంజూరైనట్లు వివరించారు. ఐటీ ల్యాబ్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ల్యాబ్ మంజూరయ్యాయని త్వరలో నిధులు విడుదల అవుతాయని తెలిపారు. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధికి రాజకీయాలకతీతంగా సేవా దృక్పథంతో దాతలు ముందుకు రావాలన్నారు. దుర్గాప్రసాద్ ఆర్థిక సహాయానికి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. కైకలూరు ఏఎంసీ మాజీ ఛైర్మన్ తలారి వెంకటస్వామి, ఎన్డీయే నాయకుడు పండురాజు తదితరులు పాల్గొన్నారు.

క్రైం సమాచారం

ఆపరేషన్ చేస్తారనే భయంతో రోగి ఆత్మహత్య

ఆసుపత్రి నాలుగో అంతస్తు నుంచి దూకిన వైనం



ఆసుపత్రిలో కిందపడుకుని ధర్నా చేస్తున్న గొల్లపూడి వాసి


ఏలూరు క్రైం, జూలై 2 : ఆసుపత్రిలో ఆపరేషన్ కోసం చేరిన ఒక రోగి తనకు ఆపరేషన్ చేస్తారనే భయంతో నాలుగో అంతస్తు నుంచి కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ముసునూరు మండలం గొల్లపూడికి చెందిన వేమూరి సత్యనారాయణ(40) కొంతకాలం నుంచి అనారోగ్యంతో ఉంటు న్నాడు. అతడిని కుటుంబ సభ్యులు ఏలూరు సమీపంలోని ఆశ్రం ఆసుప త్రిలో ఈనెల ఒకటో తేదీన చేర్పించారు. మంగళవారం పలు వైద్య పరీక్షలు నిర్వహించి రెండు రోజుల్లో ఆపరేషన్ చేస్తామని వైద్యులు మధ్యాహ్నం తెలియజేశారు. ఈ విషయం తెలుసుకున్న అతడు నాలుగో అంతస్తులోని తన రూమ్ బాత్‌రూమ్‌లోకి వెళ్లి మధ్యాహ్నం రెండు గంటల సమయంలో కిటికీ నుంచి కిందకు దూకడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఏలూరు రూరల్ పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్ళి పరిశీలించారు. ఆ గ్రామానికి చెందిన ఓ వ్యక్తి నేలపై పడుకుని ధర్నాకు దిగారు. అతడి మరణానికి ఆసుపత్రి సిబ్బంది నిర్లక్ష్యమేనని ఆరోపించారు. చివరకు పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తామని చెప్పడంతో ధర్నా విరమించారు. మృతదేహానికి పోస్టుమార్టం నిమిత్తం మంగళవారం రాత్రి ఏలూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కేసును అనుమానస్పద మృతిగా నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

ముసునూరు, జూలై 2: వివాహిత అదృశ్యంపై మంగళవారం ముసునూరు పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్ఐ పి.వాసు వివరాల ప్రకారం మండలంలోని వేల్పుచర్ల గ్రామానికి చెందిన దేవరపల్లి గౌరికి, గోనే నవీన్‌లకు ఆరేళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు పిల్లలు. భార్యభర్తల మధ్య మనస్పర్థల కారణంగా ఆమె పుట్టింటి వద్దే ఉంటోంది. అయితే గత నెల 11 నుంచి గౌరి కనిపించకుండా పోయింది. అప్పటి నుంచి ఆమె ఆచూకీ తెలియలేదు. పిల్లలు తల్లి కోసం అల్లాడిపోతున్నారని, తన భార్య ఆచూకీ తెలపాలని నవీన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

ముసునూరు, జూలై 2: మండలంలోని రమణక్కపేటలో పేకాట శిబిరంపై మంగళవారం పోలీసులు దాడి చేశారు. దాడిలో విస్సన్నపేటకు చెందిన పుట్లూరి వినోద్, కొండపర్వకు చెందిన మాణిక్యాల సాంబయ్య, చాట్రాయి మండలం చిత్తపూరుకు చెందిన పొన్నగంటి తేజ్‌కుమార్‌లను అదుపులోకి తీసుకుని రూ. 30 వేలు నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వాసు తెలిపారు.



పొంచి ఉన్న ప్రమాదం

కూలేందుకు సిద్ధంగా ఓవర్ హెడ్ ట్యాంక్ ▸ పక్కనే పాఠశాల ఉండడంతో ఆందోళన

కలిదిండి, జూలై 2 : మండలంలోని పెదలంకలో ఓవర్ హెడ్ ట్యాంక్ శిథిలావస్థకు చేరి కూలి పోవటానికి సిద్ధంగా ఉంది. పక్కనే జడ్పీ హైస్కూల్ ఉంది. ఏ క్షణంలో కూలిపోతుందోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. సుమారు 35 ఏళ్ల క్రితం ఈ ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మించారు. పిల్లర్ల పెచ్చులూడి ఇనుప చువ్వలు బయటప డటంతో జడ్పీ హైస్కూల్ వైపునకు కూలిపోయే ప్రమాదం ఉంది. నిత్యం విద్యార్థులు ట్యాంక్ సమీపంలో ఉన్న ప్రైవేట్ వాటర్ ప్లాంట్ వద్దకు మంచినీరు తాగటానికి వస్తుంటారు. ట్యాంక్ కూలితే విద్యార్థులకు ప్రమాదం బారిన పడే అవకాశం ఉందని తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. సుమారు పదేళ్లుగా ఈ ట్యాంక్‌ను ఉపయోగించటం లేదు. శిథిలావస్థకు చేరిన ఓవర్ హెడ్ ట్యాంక్ కూలిపోవటానికి సిద్ధంగా ఉందని వెంటనే తొలగించాలని 'ఆంధ్రజ్యోతి' పలుమార్లు హెచ్చరించింది. తూతూ మంత్రంగా ట్యాంక్‌ను పరిశీలించి చేతులు దులుపుకుంటున్నారు. పాఠ శాలలు తెరుచుకోవటంతో నిత్యం విద్యార్థులు ఈ ట్యాంక్ సమీపంలో ఆడుకుంటూ ఉంటారు. వర్షాలు కురుస్తుండటంతోపాటు ఈదురు గాలులు వీయటం తో హైస్కూల్ వైపుకు కుంగిందని వెంటనే తొలగిం చకపోతే కూలిపోయే ప్రమాదం ఉందని గ్రామస్థులు హెచ్చరిస్తున్నారు. ట్యాంక్ తొలగిం చాలని పలుమా ర్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవటం లేదని ఆరోపిస్తున్నా రు. ప్రాణ నష్టం జరుగక ముందే ఉన్నతాధికారులు స్పందించి కూలిపోవ టానికి సిద్ధంగా ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్‌ను వెంటనే తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.

రహదారి, కల్వర్టుల నిర్మాణానికి పరిశీలన





ఈదులగూడెంలో పరిశీలిస్తున్న ఎస్ఈ జాన్ మోషే (ఇన్‌సెట్) అటపాక పక్షుల కేంద్రం డ్వామా పీడీ

కైకలూరు, జూలై 2: కొల్లేరు పక్షుల కేంద్రం పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్టు డ్వామా పీడీ ఎ. రాము అన్నారు. మంగళవారం కైకలూరు మండలం అటపాక పక్షుల కేంద్రంలో సీసీ రహదారి నిర్మాణానికి ఆయన పరిశీలించారు. ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ టూరిజం శాఖను ఆదేశించడంతో ఈ మేరకు అధికారులు రహదారిని పరిశీలించారు. పక్షుల కేంద్రం ప్రారంభం నుంచి ఈడీసీ కేంద్రం వరకు 1300 మీటర్ల పొడవునా సిమెంటు రోడ్డు నిర్మాణం, పక్కా డ్రైన్ ఏర్పాటుకు పరిశీలించారు. పక్షుల కేంద్రం గట్టు వెడల్పు తక్కువగా ఉన్నందున 3 మీటర్ల వెడల్పు చొప్పున సీసీ రహదారి నిర్మించాలని నిర్ధారించారు. అనంతరం కొల్లేటికోట పెద్దింటమ్మ ఆలయానికి వెళ్లే రహదారి సీసీ రోడ్డు నిర్మాణానికి పరిశీలించారు. లక్ష్మీపురం వెళ్లే రహదారి నుంచి అమ్మవారి కోనేరు వరకు సీసీ రోడ్డు సుమారు 500 మీటర్ల పొడవున నిర్మించాలని, దీనిపై ప్రత్యేకంగా నివేదిక తయారుచేసి ఉన్నతాధికారులకు అందజేస్తున్నట్లు తెలిపారు. అటపాక పక్షుల కేంద్రంలో 2017వ సంవత్సరంలో పక్షుల పండుగ చేసిన సమయంలోనే ఈ రహదారి నిర్మాణానికి యోచించారు. అపుడు ప్రతిపాదనలు చేసి పనులు ప్రారంభించే సమయానికి ప్రభుత్వం మారడంతో ఆ సమస్య పరిష్కారం కాలేదు. ఎమ్మెల్యే కామినేని చొరవతో మరలా రహదారి నిర్మాణానికి అధికారులు చర్యలు ప్రారంభించారు. ఏపీడీ జి. సుధాకర్, పంచాయతీరాజ్ ఏఈ పాషా తదితరులు పాల్గొన్నారు.

కల్వర్టుల నిర్మాణాలకు..

ఆగిరిపల్లి: ఈదులగూడెం గ్రామంలో పలు కల్వర్టులను ఆర్అండ్‌బీ అధికారుల బృందం మంగళవారం పరిశీలించింది. ఈదులగూడెం గ్రామంలోని హైస్కూల్ వద్ద కల్వర్టు సక్రమంగా లేకపోవడం, గ్రామంలో పలుచోట్ల కల్వర్టులు నిర్మించాల్సిన పరిస్థితిని ఉమ్మడి కృష్ణాజిల్లా తెలుగు రైతు మాజీ అధ్యక్షుడు చిట్నేని శివరామకృష్ణ, మంత్రి పార్థసారథి దృష్టికి తీసుకు రాగా స్పందించిన ఆయన సమస్యను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. ఈ నేపథ్యంలో ఆర్అండ్‌బీ ఎస్ఈ జాన్ మోషే, కిషోర్, డీఈ బాబూరావు, ఏఈ అశోక్‌కుమార్‌లు ఆయా ప్రాంతాలను పరిశీలించి కల్వర్టులను వారం రోజుల్లో పూర్తిచేస్తామని గ్రామస్థులకు హామీ ఇచ్చారు.









ఏలూరు ఆస్పత్రిలో మహిళా పోలీసు.. మంగళగిరి ఆస్పత్రిలో సచివాలయ ఉద్యోగి.. ముదినేపల్లిలో వినోద్ పెన్షన్ల పంపిణీ, సీఎంకు పాలాభిషేకం

ఆస్పత్రులకు వెళ్లి మరీ పింఛన్ల పంపిణీ

కైకలూరు, జూలై 2: కైకలూరు మండలంలో ఎన్టీఆర్ భరోసా పెన్షన్‌ల పంపిణీ నూరుశాతం పూర్తయింది. కైకలూరుకు చెందిన లంకపల్లి లక్ష్మీ అనారోగ్యంతో భీమవరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండడంతో 4వ సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ వి వసంతకుమార్ నేరుగా భీమవరంలోని ఆసుపత్రిలో రూ.7 వేలు వితంతు పెన్షన్‌ను పంపిణీ చేశారు. అలాగే ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న దాసరి పుష్పకు దివ్యాంగ పెన్షన్‌ను నేరుగా ఏలూరులో మహిళా పోలీసు కె. స్వరూప్య అందజేసినట్లు కైకలూరు పంచాయతీ కార్యదర్శి ఆదిరాజు వెంకటేశ్వరరావు తెలిపారు.

చాట్రాయి: పెన్షన్ లబ్ధిదారుడైన వృద్ధుడు ఆస్పత్రిలో చేరి చికిత్స పొందుతుండడంతో సేవాభావంతో 100 కిలోమీటర్లు దూరంలో ఉన్న ఆస్పత్రికి వెళ్ళి పెన్షన్ అందించిన సచివాలయ ఉద్యోగిని గ్రామస్థులు అభినందించారు. మండలంలోని చనుబండ గ్రామానికి చెందిన వృద్ధాప్య పెన్షన్‌దారు తాటిచర్ల వెంకటేశ్వరరావు అనారోగ్యానికి గురై గుంటూరు జిల్లా మంగళగిరి ఎన్నారై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. చనుబండ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ ఏకాంబరాచారి మంగళవారం ఆసుపత్రికి వెళ్ళి పెన్షన్ అందజేశారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి

ముదినేపల్లి: ఎన్డీఏ ప్రభుత్వం ముస్లిం మైనార్టీల సంక్షేమానికి కట్టుబడి ఉందని టీడీపీ కైకలూరు నియోజకవర్గ పోల్ మేనేజ్‌మెంట్ ఇన్‌చార్జ్ కొడాలి వినోద్ అన్నారు. ముదినేపల్లిలో మంగళవారం ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను ఆయన పంపిణీ చేశారు. నియోజకవర్గంలో ముస్లిం నివాస ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని తెలిపారు. టీడీపీ నాయకులు పంతగాని సురేష్, రియాజ్, పంచాయతీ కార్యదర్శి రమేష్ తదితరులు పాల్గొన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు, జనసేన మండల కన్వీనర్ వీరంకి వెంకటేశ్వరరావు తదితరులు పెయ్యేరు, ఊటుకూరు గ్రామాల్లో రెండో రోజు పెన్షన్లను పంపిణీ చేశారు.

పెదపాలపర్రులో సీఎంకు పాలాభిషేకం

రూ.7 వేలు పెన్షన్ ఇవ్వటం పట్ల హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తూ ముదినేపల్లి మండలం పెదపాలపర్రులో టీడీపీ నాయకులు, పెన్షనర్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి మంగళవారం పాలాభిషేకం చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు చల్లగుళ్ల శోభనాద్రి చౌదరి ఆధ్వర్యం లో సర్పంచ్ గంటా రాకేష్, మండల తెలుగు రైతు అధ్యక్షుడు లక్ష్మీనరసింహా రావు, పార్టీ కార్యకర్తలు, మహిళలు, పలువురు పెన్షన్‌దారులు చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం చేసి, పెన్షన్ల పెంపుపై ఆనందం వ్యక్తం చేశారు. కాగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీ ముదినేపల్లి మండలంలో దాదాపు పూర్తయింది. రెండు రోజులుగా 99.4 శాతం పెన్షన్ల పంపిణీ పూర్తయింది. మండలంలో 9073 మంది పెన్షనర్లకు రూ.6,11,85,500లు పంపిణీ చేయాల్సి ఉండగా, 9018 మంది పెన్షనర్లకు రూ.6,08,18,387లు పంపిణీ చేశామని ఎంపీడీఓ ఎస్.మురళీ గంగాధరరావు తెలిపారు.

కలిదిండి: మండలంలో లబ్ధిదారులకు 99 శాతం పింఛన్లు పంపిణీ చేశామని ఎంపీడీవో దినతేజ్ తెలిపారు. ఇతర ప్రాంతాల్లో ఉన్న కొంతమందికి కూడా పింఛన్లు పంపిణీ చేయటానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. నూరు శాతం పింఛన్లు పంపిణీయే తమ లక్ష్యమన్నారు.

రాహుల్ వ్యాఖ్యలపై బీజేపీ నాయకుల ఖండన

కలిదిండి, జూలై 2: హిందువులపై రాహుల్ వ్యాఖ్యలను బీజేపీ నాయకులు ఖండించారు. మంగళవారం కలిదిండిలో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ శాంతి కాముకులుగా ఉన్న హిందువులను హింసాత్ములు అని రాహుల్ వ్యాఖ్యానించటం దారుణమన్నారు. బీజేపీ మండల అధ్యక్షులు నంబూరి బాండు రాజు, నాయకులు చిట్టూరి రవీంద్ర, కోకా రమేష్, కె.శ్రీనివాస్, చక్కా జగన్, లంకా రత్నారావు, జడ్డు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ బిల్లుల చెల్లింపులకు యాప్ మార్పు

ముదినేపల్లి, జూలై 2 : ఆర్‌బీఐ మార్గదర్శక సూత్రాల ప్రకారం వినియోగదారులు తమ విద్యుత్ బిల్లులు చెల్లించేందుకు యాప్స్‌లో మార్పులు చేసినట్లు ముదినేపల్లి ఏపీ ట్రాన్స్‌కో ఏఈ పి.రవికుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటి వరకు విద్యుత్ బిల్లులు చెల్లింపులకు వినియోగించిన ఫోన్ పే, పేటీఎం, అమెజాన్ పే, గూగుల్ పే వంటి థర్డ్ పార్టీ యాప్స్ లాంటివి చెల్లింపునకు నిలిపివేసినట్లు తెలిపారు. ఇక ముందు ఏపీ సీపీడీసీఎల్ కన్స్యూమర్ యాప్‌ని గూగల్ ప్లే స్టోర్ నుంచి డౌన్ లోడ్ చేసుకుని గానీ, ఏపీసీపీడీసీఎల్ డిస్కం వెబ్‌సైట్ నుంచి గానీ విద్యుత్ బిల్లులు చెల్లించాలని ఏఈ తెలిపారు. ఈ విధానంలో కూడా వినియోగదారులు తమ ఫోన్ పే, జీపే, పేటిఎమ్, ఇతర యుపిఐ యాప్స్‌ను వినియోగించుకోవచ్చునని తెలిపారు.

రుణాల వసూళ్లలో హ్యాట్రిక్



ముదినేపల్లి, జూలై 2 : ముదినేపల్లి సహకార బ్యాంక్ బ్రాంచి పరిధిలోని ఉప్పరగూడెం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం 2023-24 సంవత్సరానికి నూరు శాతం రుణాలను వసూలు చేసింది. వరుసగా మూడు సంవత్సరాలు సభ్యుల స్థాయిలో నూరు శాతం రుణాలు వసూలు చేసి హ్యాట్రిక్ సాధించింది. సంఘంలో 235 మంది సభ్యుల నుంచి 3.73 కోట్ల రూపాయల రుణాల వసూళ్ల లక్ష్యం కాగా, సహకార ఆర్థిక సంవత్సరం జూన్ 30 లోగా ఆ లక్ష్యాన్ని సాధించినట్లు సంఘ సీఈవో వెంకటేశ్వరరావు తెలిపారు. మంగళవారం బ్రాంచి మేనేజర్ వి.సత్యకుమార్, సూపర్‌వైజర్ నాగభూషణంకు నూరు శాతం రుణాల వసూళ్ల పత్రాన్ని సంఘ సీఈవో అందజేశారు. సీఈఓను, సంఘ సిబ్బందిని బ్రాంచి మేనేజర్‌తోపాటు సంఘ పర్సన్ ఇన్‌చార్జి నాగేశ్వరరావు అభినందించారు. బ్రాంచి పరిధిలో 13 సంఘాల ఉండగా, 2023-24 సంవత్సరానికి ముదినేపల్లి, ఉప్పరగూడెం సంఘాలే నూరు శాతం రుణాలను వసూలు చేశాయి.



కైకలూరులో మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు



ముదినేపల్లిలో మొక్క నాటుతున్న కృష్ణారావు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

కైకలూరు, జూలై 2: ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ వేంపాటి విష్ణురావు అన్నారు. ప్రధాని మన్‌కీ బాత్ కార్యక్రమంలో అమ్మ పేరిట మొక్క నాటాలని ఇచ్చిన పిలుపు మేరకు మంగళవారం కైకలూరులో మొక్కలు నాటారు. తల్లి తన బిడ్డలను ఎలా కాపాడుతుందో మొక్కలు నాటితే ప్రకృతి కూడా మానవ మనుగడను పరిరక్షిస్తుందన్నారు. కైకలూరు సర్పంచ్ డీఎం నవరత్నకుమార్, బీజేపీ నాయకులు కోటప్రోలు కృష్ణ, కీర్తి రాంప్రసాద్, కట్టా వీరరాఘవులు, బొల్లా శ్యామలరాజు గౌడ్, పామర్తి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ముదినేపల్లి: ప్రధాని మోదీ పిలుపు మేరకు ఏక్ పేడ్ మాకే నామ్ (అమ్మ పేరుతో మొక్కను నాటాలి) కార్యక్రమాన్ని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటప్రోలు కృష్ణారావు ముదినేపల్లి మండలంలో మంగళవారం ప్రారంభించారు. పెయ్యేరులో తన నివాసం వద్ద ఆయన మొక్క నాటారు. పర్యావరణాన్ని పరిరక్షించటం ప్రతి ఒక్కరి బాధ్యత అని బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టాలని కృష్ణారావు కోరారు. బీజేపీ మండల అధ్యక్షురాలు సత్యవోలు నాగలక్ష్మి, జిల్లా కమిటీ సభ్యులు మేలిమి చిట్టిబాబు, వత్తుమిల్లి ప్రసాద్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన సర్టిఫికెట్ల వెరిఫికేషన్

నూజివీడు టౌన్, జూలై 2: రాజీవ్‌గాంధీ యూనివర్శిటీ ఆఫ్ నాలెడ్జ్ అండ్ టెక్నాలజీ పరిధిలోని ట్రిపుల్ ఐటీల్లో ఆరేళ్ళ ఇంటిగ్రేటెడ్ ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలకు ప్రత్యేక కేటగిరి అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమం 2వ రోజు కొనసాగింది. మంగళవారం సైనిక సంతతికి చెందిన విద్యార్థులు 62 మంది, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ విభాగంలో 113 మంది మొత్తం 175 మంది విద్యార్థులు సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరు అయ్యారు. అడ్మిషన్స్ కన్వీనర్ ప్రొఫెసర్ ఎస్.అమరేంద్రకుమార్ ఆధ్వర్యంలో ట్రిపుల్ ఐటీ అధికారులు సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమాన్ని నిర్వహించగా, బుధవారం సైనిక సంతతికి చెందిన విద్యార్థులు భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, దివ్యాంగులు, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ కేటగిరిల్లో సర్టిఫికెట్ వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ట్రిపుల్ ఐటీ అధికార వర్గాలు తెలిపాయి.

నేడు అందుబాటులో ఎమ్మెల్యే కామినేని

కైకలూరు, జూలై 2: కైకలూరు ఎమ్మెల్యే డాక్టర్ కామినేని శ్రీనివాస్ బుధవారం ఉదయం నుంచి ప్రజలకు అందుబాటులో ఉండనున్నారు. దత్తాశ్రమంలో వైద్య శిబిరంలో, అనంతరం అన్నక్యాంటీన్ కార్యక్రమంలో పాల్గొని మధ్యాహ్నం నుంచి తన స్వగ్రామమైన వరహాపట్నంలో ప్రజలకు అందుబాటులో ఉండనున్నట్లు కార్యాలయ సిబ్బంది తెలిపారు.

రేపు మామిడి రైతుల సమావేశం

నూజివీడు టౌన్, జూలై 2: నూజివీడులో మామిడి మార్కెట్ ఏర్పాటుకు సంబంధించి రైతులు, వ్యాపారులు, సంబంధిత అధికారులతో గురువారం ఉదయం 10.30 గంటలకు ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నట్టు వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శి ఎం.శ్రీనివాసరావు తెలిపారు. సమావేశానికి మంత్రి కొలుసు పార్థసారథి ముఖ్య అతిథిగా హాజరవుతారని, ఏలూరు జిల్లా నూజివీడు, ఆగిరిపల్లి, చాట్రాయి, ముసునూరు మండలాలతో పాటు ఎన్టీఆర్ జిల్లా విస్సన్నపేట, తిరువూరు, మైలవరం, రెడ్డిగూడెం, ఏ.కొండూరు పరిసర ప్రాంతాల మామిడి రైతులు సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

రేపు విద్యా సంస్థల బంద్ జయప్రదం చేయండి

నూజివీడు టౌన్, జూలై 2: విద్యాసంస్థల బంద్‌ను జయప్రదం చేయాలని, ఐసా (ఆలిండియన్ స్టూడెంట్స్ అసోసియేషన్) రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉన్నం అనిల్ కుమార్ కోరారు. నీట్ పేపర్ లీకేజీని వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో జూలై 4న విద్యాసంస్థల బంద్‌కు పిలుపును ఇచ్చిందన్నారు. దేశవ్యాప్తంగా నీట్ ఎగ్జామ్ రాసిన విద్యార్థుల భవిష్యత్ ఏమిటో తెలియక, ర్యాంకులు కోల్పోయి, అయోమయ స్థితికి వెళ్ళిపోయారన్నారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) నీట్ ఎగ్జామ్ ప్రారంభించినప్పటి నుంచి అనేక అవకతవకలకు పాల్పడుతూనే ఉందని, అసమర్థ విధానాలను వ్యతిరేకిస్తూ చేపట్టిన విద్యాసంస్థల బంద్‌కు స్వచ్ఛందంగా సహకరించాలని పిలుపునిచ్చారు. జిల్లా కార్యదర్శి గరికే అఖిల్, నియోజకవర్గ నాయకులు వెంకటేశ్వరరావు, శ్రీను, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత గ్యాస్ కనెక్షన్‌కు దరఖాస్తు చేయండి

చాట్రాయి, జూలై 2: ప్రధాన మంత్రి ఉజ్వల యోజన-2 ప్రారంభమైందని పేదలు వినియోగించుకోవాలని నూజివీడు నియోజకవర్గ బీజేపీ కో-కన్వీనర్ ద్రోణంరాజు శ్రీనివాసరావు కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ పథకం కింద అర్హులైన లబ్ధిదారులకు రూ. 6500 విలువైన వంట గ్యాస్ కనెక్షన్, సిలిండర్ ఉచితంగా ఇవ్వటం జరుగుతుందన్నారు. అర్హత ఉన్న ప్రతి కుటుంబం ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని దగ్గరలోని మీసేవా కేంద్రాలకు వెళ్ళి ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ప్రధాన మంత్రి ఉజ్వల యోజన-1 పథకం ద్వారా కోటి కుటుంబాలకు మేలు జరిగిందన్నారు. స్థానిక బీజేపీ నాయకులు గడ్డం సంజీవరెడ్డి, ఆదిమూలం శర్మ, పోతురెడ్డిపల్లి చెన్నారావు పాల్గొన్నారు.

ప్రాజెక్టు ఫెలోషిప్ కోసం దరఖాస్తుల ఆహ్వానం

కైకలూరు, జూలై 2: కైకలూరు వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రాజెక్టు ఫెలోషిప్ కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు అధ్యాపకుడు డాక్టర్ ఎం. విజయకుమార్ తెలిపారు. కైకలూరు వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రాష్ట్రీయ ఉచిత శిక్షా అభియాన్ (రూసా) నిధుల ద్వారా చేసే పరిశోధనలకు సహాయకుడిగా ప్రాజెక్ట్ ఫెలో నియామకం కోసం అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఎంఎస్సీ జువాలజీ, ఆక్వాకల్చర్, ఫిషరీస్‌లో కనీసం 50శాతం మార్కులు ఉండాలన్నారు. 1 లేదా 2 సంవత్సరాల కాలపరిమితికి గాను ప్రాజెక్టు ఫెలో అవసరముంటుందన్నారు. నెలకు రూ.12 వేలు వేతనం ఉంటుందని, ఆసక్తి కల్గిన వారు కైకలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాలకు సెల్ నెంబరు 94900 86886లో సంప్రదించాలన్నారు.



నాయకుల చిత్రపటాల ఆవిష్కరణ

చాట్రాయి, జూలై 2: మండలంలోని చనుబండ-2 సచివాలయంలో మంగళవారం ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, మంత్రి కొలుసు పార్థసారథి చిత్రపటాలను స్థానిక టీడీపీ నాయకులు ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ ఎన్డీఏ పాలనలో దేశం, రాష్ట్రం అన్ని రంగాలలో గణనీయమైన అభివృద్ధిని సాధిస్తుందని, భావితరాలకు బంగారు భవిష్యత్తు వస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. టీడీపీ నాయకులు బొంతు సతీశ్, ములగలపాటి శ్రీనివాసరావు, మోరంపూడి మురళీకృష్ణ, మోరంపూడి రాము, బొట్టు దుర్గారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పాడి రైతుల సంక్షేమమే ధ్యేయం: చలసాని

నూజివీడు, జూలై 2: పాడి రైతుల సంక్షేమమే విజయ డెయిరీ ధ్యేయమని, కృష్ణామిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. నూజివీడు మండలం హనుమంతులగూడెం, వెంకటాద్రిపురం పాలకవర్గ సభ్యులు, అధ్యక్షులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడుతూ పాడిరైతు సంక్షేమం కోసం విజయ డెయిరీ కృషి చేస్తోందన్నారు. దేశంలోనే అత్యధిక పాలసేకరణ రేటును ఇవ్వడమే కాక బోనస్‌లు పంపిణీ, వివాహ సందర్భాల్లో బంగారు నాణెం అందిస్తూ ముందుకు సాగుతోందన్నారు. పాలకవర్గ సభ్యులు, వెంకటాద్రిపురం సొసైటీ అధ్యక్షురాలు శనగల వెంకట శివజ్యోతి, హనుమాన్ జంక్షన్ క్లస్టర్ మేనేజరు హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సుబ్రహ్మణ్యేశ్వరుడి కళ్యాణం

ముదినేపల్లి, జూలై 2 : ముదినేపల్లి మండలం సింగరాయిపాలెం - చేవూరు పాలెం సెంటర్‌లోని శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారి శాంతి కళ్యాణం మంగళవారం వైభవంగా జరిగింది. అర్చకుడు తోలేటి వీరభద్ర శర్మ ఆధ్వర్యంలో వేద పండితులు పలువురు దంపతులతో కల్యాణాన్ని జరిపించారు. దేవస్థానం అసిస్టెంట్ కమిషనర్ ఎస్.సంధ్య కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

ఘనంగా రక్షణ సైన్యం వ్యవస్థాపక దినోత్సవం

ముసునూరు, జూలై 2: రక్షణ సైన్యం సంస్థ వ్యవస్థాపక దినోత్సవాన్ని ముసునూరు రక్షణ సైన్యం చర్చి వద్ద మంగళవారం ఘనంగా నిర్వహించారు. చర్చి పాస్టర్ కెప్టెన్ ఎం.రాజు, వనిత సంస్థ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం క్రీస్తు భక్తి గీతాలను ఆలపించి, ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అలాగే కాట్రేనిపాడు, గోపవరం, పెదపాటివారిగూడెం, వేల్పుచర్ల గ్రామాల్లో ఉన్న రక్షణ సైన్యం చర్చిల వద్ద వేడుకలు ఘనంగా నిర్వహించారు. సంఘ పెద్దలు యాకోబు, యువరాజు, సురేష్, తోమరాజు, సంఘస్థులు, గృహ సమితి మహిళలు, యువకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పెన్నుల వితరణ



కైకలూరు, జూలై 2: పాఠశాలలో విద్యార్థుల విద్యాభివృద్ధికి దాతల సహకారం అభినందనీయమని హెచ్‌ఎం లక్ష్మీ రాజేశ్వరి అన్నారు. మంగళవారం కైకలూరు మండలం భుజబల పట్నం జడ్పీ హైస్కూల్ విద్యార్థులు 450 మందికి గ్రామానికి చెందిన ముదునూరి నాగరాజు, గీత దంపతులు పెన్నులను పంపిణీ చేశారు. గ్రామస్థులు గొట్టుముక్కల రంగరాజు, ఎం. కొండరాజు తదితరులు పాల్గొన్నారు.